ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



చిత్తూరు జిల్లా వార్తలు

శుక్రవారం 15 నవంబరు 2024



ఘనంగా బాలల దినోత్సవం



జిల్లావ్యాప్తంగా పాఠశాలల్లో గురువారం బాలల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు.భారత ప్రథమ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఆయన సేవలను గుర్తు చేసుకుని నివాళులర్పించారు.పాఠశాలల ఉపాధ్యాయులతో పాటు విద్యాశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

- వెదురుకుప్పం, ఆంధ్రజ్యోతి

కార్వేటినగరం మండలం డీఎంపురం జడ్పీ హైస్కూల్లో వేడుకలు

కార్తీక వేళ..

నేడు శివాలయాల్లో పౌర్ణమి సందడి

- 7వ పేజీలో-

రెక్కల కింద పిల్లను దాచి కాపాడే తల్లి కోడిలా.. బిడ్డను పొదివి పట్టుకున్న అమ్మలా.. ఈ చెట్టు నందీశ్వరుడిని తన కాండంలో ఇముడ్చుకుంది. సదుం మండలం చింతలవారిపల్లె పంచాయతీ జంగంపల్లెలోని కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ గర్భగుడి ఎదురుగా ఈ వృక్షబంధం చూపరులను ఆకట్టుకుంటోంది. నంది విగ్రహం పక్కనే పడి మొలిచిన మర్రి చెట్టు పెరిగి ఇలా నందీశ్వరుడిని అక్కున చేర్చుకుంది. కార్తీకమాసంలో ఈ ఆలయాన్ని భక్తులు విశేషంగా సందర్శిస్తారు. నేడు కార్తీక పౌర్ణమి సందర్భంగా దీపారాధనలు చేస్తారు.

- సదుం, ఆంధ్రజ్యోతి

చిత్తూరు కల సాకారం

అడవిపల్లె రిజర్వాయర్ నుంచి 0.785 టీఎంసీ నీళ్ల కేటాయింపునకు ప్రభుత్వ అనుమతులు

ఏడాదిలో చిత్తూరుకు నీళ్లు వచ్చే అవకాశం

చిత్తూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగర దాహార్తి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఏళ్లుగా ఎదురు చూస్తున్న అడవిపల్లె రిజర్వాయర్ నీళ్లను 0.785 టీఎంసీల మేర చిత్తూరుకు కేటాయిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ఈ అంశాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లడంతో పాటు బుధవారం అసెంబ్లీలో తన గళాన్ని వినిపించిన విషయం తెలిసిందే. రిజర్వాయర్ నుంచి నీళ్లను పొందే అనుమతులు సాధించినా.. చిత్తూరుకు నీళ్లు రావాలంటే కనీసం ఏడాది సమయం పట్టొచ్చు.

● అడవిపల్లె రిజర్వాయర్ కథ ఇదీ

రాయలసీమ ప్రజల తాగు, సాగు సమస్యలను తీర్చేందుకు హంద్రీనీవా సుజల స్రవంతి ప్రాజెక్టును దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్ ప్రారంభించారు. కర్నూలు జిల్లా మల్యాల నుంచి ప్రారంభమై మొత్తం 554 కిలోమీటర్లు ప్రయాణించి అన్నమయ్య జిల్లా కేవీపల్లె మండలంలోని అడవిపల్లె రిజర్వాయర్ వద్ద ముగుస్తుంది. హంద్రీనీవా ప్రాజెక్టులో భాగంగా ఈ అడవిపల్లె రిజర్వాయర్‌ను 2006లో ప్రారంభించి 2019లో పూర్తి చేశారు. 0.1 టీఎంసీ సామర్థ్యంతో ఉన్న చెరువు స్థానంలో 1.8 టీఎంసీ సామర్థ్యం గల రిజర్వాయర్‌గా నిర్మించారు. హంద్రీనీవా ప్రధాన కాలువ ద్వారా నీళ్లు వస్తేనే ఈ రిజర్వాయర్ నిండుతుంది. ఇది నిండితేనే చిత్తూరుకు నీళ్లు వస్తాయి. ఎందుకంటే 554 కిలోమీటర్లున్న హంద్రీనీవా ప్రధాన కాలువ పనులు పలుచోట్ల అసంపూర్తిగా వున్నాయి. గత వైసీపీ సర్కారు ఐదేళ్ల పాటు దీన్ని పట్టించుకోని విషయం తెలిసిందే. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎం చంద్రబాబు మళ్లీ దీనిపై దృష్టి సారించారు. ఇటీవల కుప్పం వచ్చిన ఆయన హంద్రీనీవా కుప్పం బ్రాంచి కాలువను కూడా పరిశీలించి, మొత్తంగా నిధుల అంచనా కావాలని అధికారులను కోరారు. ప్రధాన కాలువ పూర్తి కావడానికి అనంతపురం, మదనపల్లె రీచుల్లో రూ.75 కోట్లు చొప్పున రూ.150 కోట్లు అవసరమని అధికారులు ప్రతిపాదనలు చేశారు. మదనపల్లె రీచులోని పడమటికొండ, కలకడ వద్ద .08 కిలోమీటర్ల కాలువ నిర్మాణంతో పాటు 12 స్ట్రక్చర్ల నిర్మాణ పనులు పెండింగులో ఉన్నాయి. వెంటనే నిధులు కేటాయించి హుటాహుటిన పనులు ప్రారంభించినా కనీసం 6 నెలల సమయం పడుతుందని అధికారులు భావిస్తున్నారు.

ప్రధాన కాలువ పూర్తయితేనే అడవిపల్లెకు నీళ్లు

హంద్రీనీవా ప్రధాన కాలువను రూ.150 కోట్లు ఖర్చు పెట్టి పూర్తి చేస్తే అడవిపల్లె రిజర్వాయర్‌కు నీళ్లు వస్తాయి.ప్రధాన కాలువకు కాంక్రీట్ లైనింగ్ పనులు చేస్తేనే పూర్తి స్థాయిలో నీళ్లు వస్తాయి. లేకుంటే 50 శాతం మాత్రమే. ప్రస్తుతం ప్రధాన కాలువకు కాంక్రీట్ లైనింగ్ పనుల ప్రతిపాదన లేదు. పుంగనూరు బ్రాంచి కాలువలో ఈ లైనింగ్ పనులు చేయబోతున్నారు. ప్రధాన కాలువలో కూడా రెండో దశలో లైనింగ్ పనులు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి.



అడవిపల్లె రిజర్వాయర్

● టీడీపీ హయాంలోనే ప్రతిపాదన

అడవిపల్లె రిజర్వాయర్ నుంచి చిత్తూరుకు నీళ్లు తేవాలనే ప్రతిపాదన ఎంతోకాలంగా ఉంది. దీని కోసం 2014-19 మధ్యనున్న టీడీపీ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది కూడా. ఈ క్రమంలోనే రూ.250 కోట్ల నిధులతో అడవిపల్లె రిజర్వాయర్ నుంచి చిత్తూరు వరకు 92 కిలోమీటర్ల మేర పైపులైను పనులు ప్రారంభించారు. 2018లో పైపులైను పనులు ప్రారంభమై 2019 వరకు 45 కిలోమీటర్ల పైపులైను పనులు పూర్తి చేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఈ పనుల్ని ఏడాది పాటు ఆపేసి.. ఆ తర్వాత 20 కిలోమీటర్ల పైపులైను ఏర్పాటు చేసింది. ఇప్పుడు ఇంకా 27 కిలోమీటర్ల మేర పైపులైను పనులు పెండింగులో ఉన్నాయి.

● పెండింగ్ పనులు పూర్తయితేనే...

అడవిపల్లె రిజర్వాయర్ నుంచి చిత్తూరు నగరానికి ప్రభుత్వం అనుమతిచ్చిన 0.785 టీఎంసీ నీళ్ల రావాలంటే కనీసం ఏడాది పట్టొచ్చు. తొలుత హంద్రీనీవా ప్రధాన కాలువ పూర్తయి, అడవిపల్లెకు నీళ్లు రావాలి. అక్కడి నుంచి చిత్తూరు వరకు పెండింగులో ఉన్న 27 కిలోమీటర్ల పైపులైను పనుల నిర్మాణం పూర్తి కావాలి. ఇదంతా కలిపి సుమారు ఏడాది సమయం పట్టొచ్చు. రంగంపేట క్రాస్ నుంచి చిత్తూరు వరకు 18 కిలోమీటర్లతో పాటు పీలేరు, కల్లూరు, పాటూరు, దామలచెరువు ప్రాంతాల వద్ద పైపులైను ఏర్పాటు చేయడానికి నేషనల్ హైవేస్ అనుమతి కావాలి. దీనికోసం ఫైల్ కదులుతోంది. అనుమతి వచ్చాక పైపులైను నిర్మాణానికి ఆరు నెలల సమయం పట్టొచ్చు. అలాగే దామలచెరువు సమీపంలోని పదిపుట్లబైలు వద్ద 2.62 ఎకరాల్లో 37 ఎంఎల్‌డీ సామర్థ్యంతో వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను నిర్మిస్తున్నారు. ఇక్కడ పరిహారం విషయంలో రైతులతో సమస్య తలెత్తింది. తిరుపతి కలెక్టర్ కల్పించుకుని పరిష్కరించాల్సి ఉంది. అలాగే రిజర్వాయర్ వద్ద సుమారు రూ.5 కోట్లతో ఇంటెక్‌వెల్ నిర్మించాల్సి ఉంది. ఇలాంటి కారణాలతో చిత్తూరుకు నీళ్లు వచ్చేందుకు సుమారు ఏడాది పట్టొచ్చు.

చిత్తూరు మున్సిపాలిటీ వాటా రూ.160 కోట్లు

అడవిపల్లె రిజర్వాయర్ నుంచి చిత్తూరు వరకు 92 కిలోమీటర్ల పైపులైను నిర్మాణం, రిజర్వాయర్ వద్ద ఇంటెక్‌వెల్, దామలచెరువు వద్ద వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ తదితరాల నిర్మాణానికి రూ.250 కోట్లను గత టీడీపీ ప్రభుత్వ హయాంలో కేటాయించారు. అందులో సుమారు రూ.160 కోట్ల వాటా చిత్తూరు మున్సిపాలిటీ వేసుకుంది. దీని కోసం పంజాబ్ నేషనల్ బ్యాంకులో రుణాన్ని తీసుకుని నెలవారీ కంతులు చెల్లిస్తున్నారు. అలాగే, రాష్ట్ర వాటా రూ.25 కోట్లుగా ఉంది. అమృత్ 1.0 పథకం కింద కేంద్ర ప్రభుత్వం మిగిలిన రూ.65 కోట్ల వాటాను కేటాయించింది.

చిత్తూరు ఎమ్మెస్సార్ సర్కిల్లో నిలిచిన వర్షపునీరు



జిల్లావ్యాప్తంగా వర్షాలు

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా జిల్లావ్యాప్తంగా మూడ్రోజులుగా తేలికపాటి నుంచి బలమైన వర్షాలు కురుస్తున్నాయి. గడిచిన 24 గంటల్లో నమోదైన వర్షపాత వివరాలిలా ఉన్నాయి. మండలాల వారీగా.. పులిచెర్లలో 19.8, రొంపిచెర్లలో 7.6, యాదమరిలో 6.8, బైరెడ్డిపల్లెలో 5.6, విజయపురంలో 4.2, సోమలలో 4, వెదురుకుప్పంలో 3.6, సదుం, నగరి, గంగాధరనెల్లూరు, వి.కోటలో 3.2, పాలసముద్రంలో 2.4, శ్రీరంగరాజపురంలో 2.2, నింద్ర, చిత్తూరులో 1.6, చౌడేపల్లె, చిత్తూరు రూరల్‌లో 1.2, తవణంపల్లెలో 0.4, పెనుమూరులో 0.2 మి.మీ వర్షపాతం నమోదయ్యింది. ఇదిలా ఉండగా, చిత్తూరు నగరంలో గురువారం ఉదయం నుంచి మబ్బులు కమ్మేసింది. ఆగి ఆగి వర్షం కురుస్తూ, ఉరుములు, పిడుగులతో ప్రజానీకాన్ని ఒకింత ఇబ్బందులకు గురిచేసింది. విద్యుత్ సరఫరాకు పలుసార్లు అంతరాయం ఏర్పడింది.

వైభవంగా మహాపూర్ణాహుతి

● వరసిద్ధుడి ఆలయంలో ముగిసిన పవిత్రోత్సవాలు

ఐరాల(కాణిపాకం), నంవబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలోని వరసిద్ధుడి వినాయక స్వామి ఆలయంలో మూడ్రోజులుగా నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలు గురువారంతో ముగిశాయి. ఉదయం అవభృథ, యాగపూజ, స్తండిల మండలేశ్వర పూజ, హోమవ్రత, మహాపవిత్ర సమర్పణ, విశేష ద్రవ్యాహుతి, మహాపూర్ణాహుతి, మహాదీపారాధన, యాత్రదానం, మూల విరాట్‌కు స్నపనాభిషేకం, కుంభ చండీయాగం, మహాదీపారాధన వైభవంగా నిర్వహించారు. ఏటా ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ముగిశాక పవిత్రోత్సవాలను నిర్వహించడం ఆనవాయితీ. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో గురుప్రసాద్, ఏఈవో రవీంద్ర బాబు, సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు, అర్చకులు ధర్మేశ్వరగురుకుల్, వేద పండితులు పాల్గొన్నారు.



మరోసారి టీచర్ల సర్దుబాటు

● కొత్త జిల్లా ప్రాతిపదికగా చేపట్టనున్న ప్రక్రియ

చిత్తూరు సెంట్రల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మరోసారి టీచర్ల సర్దుబాటు చేయడానికి విద్యాశాఖ చర్యలు చేపట్టింది. రెండు నెలల వ్యవధిలో రెండోసారి ఈ ప్రక్రియ చేపట్టనుంది. డీఎస్సీ ద్వారా పాఠశాలల్లోని ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయనున్న క్రమంలో వర్క్ అడ్జస్టెంట్ చేస్తే కొత్తగా వచ్చే టీచర్లకు పోస్టింగ్‌లు ఇచ్చేందుకు సులభమవుతుందని ప్రభుత్వం భావించింది. ఆమేరకు జిల్లా శాఖ అధికారులకు సూచనలు జారీ చేసింది. పదవీ విరమణ, మరణించిన వారి స్థానాలను భర్తీ చేయడంతోపాటు విద్యార్థి, టీచర్ల నిష్పత్తి ఆధారంగా తీసుకోనున్నారు. ఈ సర్దుబాటును కొత్త జిల్లా ప్రాతిపదికనే చేపట్టనున్నారు.

7639 మంది టీచర్లు

జిల్లాలో ప్రభుత్వ, జడ్పీ, ఎంపీపీ, మున్సిపల్ పాఠశాలలు 2,420 ఉన్నాయి. ఇందులో 1,946 ప్రాథమిక, 158 ప్రాథమికోన్నత, 316 ఉన్నత పాఠశాలలున్నాయి. 7,639 మంది టీచర్లు ఉన్నారు. వీరిలో.. ఎస్జీటీలు 3576, స్కూల్ అసిస్టెంట్లు 3631, ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎంలు 192, హైస్కూల్ హెచ్‌ఎంలు 219, పీఈటీ, డ్రాయింగ్, క్రాఫ్టు కేటగిరిలకు చెందిన 21 మంది ఉన్నారు.



డీఈవో కార్యాలయం

తాజాగా 350 మంది సర్దుబాటు?

సెప్టెంబరులో 462 ఖాళీలకు టీచర్ల సర్దుబాటు ప్రక్రియ చేపట్టారు. ఇందులో ఎస్జీటీలు 332 మంది ఉండగా, స్కూల్ అసిస్టెంట్లు 130 మంది ఉన్నారు. తాజాగా ఈనెలలో 350 మంది టీచర్ల సర్దుబాటు చేపట్టనున్నారు. ఇందులో ఎస్జీటీలు 330, స్కూల్ అసిస్టెంట్ 20 ఖాళీలు ఉన్నాయి.

తొలుత మండల స్థాయి నుంచే..

తొలుత జిల్లా స్థాయిలో డీఈవో లాగిన్ నుంచి సర్దుబాటు చేయాలని భావించినా, చివరికి గతంలో మాదిరిగానే టీచర్ల సర్దుబాటు చేపట్టేందుకు రాష్ట్ర విద్యాశాఖ ఆమోదం తెలిపింది. ఈ క్రమంలో తొలుత మండల స్థాయి, ఆపై డివిజన్, జిల్లా స్థాయిలో చేపట్టనున్నారు.

20మందికి సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి

చిత్తూరు రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ పరిధిలో పనిచేస్తున్న 20 మంది జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్టులకు సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పిస్తూ జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.మిగిలిన క్యాడర్లకు కూడా శుక్రవారం నాటికి పదోన్నతులు కల్పిస్తున్నట్లు తెలిపారు.

నేడు తరల్‌పై శిక్షణ కార్యక్రమం

చిత్తూరు సెంట్రల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): టీచింగ్ ఎట్ రైట్ లెవల్ (తరల్)పై శిక్షణ కార్యక్రమం శుక్రవారం ఉదయం 10 గంటలకు జడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు డీఈవో వరలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఈవోలు, సీఆర్‌సీ, హెచ్‌ఎం, ఎంఆర్‌సీలు, సీఆర్‌పీలు హాజరు కావాలని సూచించారు.

అప్పుడేం జరిగింది?

తిరుపతి కార్పొరేషన్లో గత అధికారులపై విచారణ

ఆర్డీ నేతృత్వంలో లోతుగా ఆరా తీస్తున్న బృందాలు

తిరుపతి నవంబర్ 14 (ఆంధ్రజ్యోతి): తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్లో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న పూర్వ అధికారులపై విచారణ వేగవంతమైంది. మంత్రి లోకే‌ష్‌కు అందిన ఫిర్యాదుల నేపథ్యంలో డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ఆదేశాలతో గురువారం కార్పొరేషన్ కార్యాలయానికి విచారణ బృందం వచ్చింది. అనంతపురం రీజనల్ డైరెక్టర్ విశ్వనాథ్ నేతృత్వంలో ప్రొద్దుటూరు, కళ్యాణదుర్గం,పుత్తూరు మున్సిపల్ కమిషనర్లతో పాటు ఓ రెవెన్యూ అధికారి, ఇద్దరు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ల బృందం విచారణ మొదలుపెట్టింది. గతంలో ఇక్కడ రెవెన్యూ అధికారిగా పనిచేసిన కేఎల్‌వర్మకు సంబంధించిన వ్యవహారాలపై ఆరా తీశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో అడ్డగోలుగా ఇంటి పన్నులు పెంచిన, తగ్గించిన అభియోగాలపై రికార్డులను పరిశీలించారు. ఆయన దగ్గర పనిచేసిన రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు మధుసూదన రెడ్డి,భాస్కర రెడ్డి, సూరిబాబు,ప్రకాష్, నవీన్‌లను విచారించారు. శుక్రవారం క్షేత్రస్థాయిలోనూ పరిశీలించి ఇంటి పన్నుల వ్యత్యాసాలపై తనిఖీ చేయనున్నారు.మున్సిపల్ గత మేనేజర్ చిట్టిబాబుపై వచ్చిన ఆరోపణలకు సంబంధించి కూడా విచారణ జరుగుతున్నట్లు సమాచారం.కార్పొరేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈవెంట్లకు సంబంధించి ఆర్గనైజర్‌కు అడ్డగోలుగా బిల్లులు చెల్లించారనే ఆరోపణపై ఆరా తీశారు. కార్పొరేషన్ అకౌంటెం ట్‌ను పిలిచి ఓచర్లను పరిశీలించారు.వారం రోజుల్లో ప్రభుత్వా నికి నివేదిక అందజేయనున్నట్లు తెలిసింది.

గృహ ప్రవేశానికి వచ్చి మృత్యు ఒడికి..

రోడ్డు ప్రమాదంలో తల్లీ కూతుళ్ల మృతి



నుజ్జు నుజ్జు అయిన కారు



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సావిత్రి, సంగీత



తిరుపతి(నేరవిభాగం), నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): వారందరూ ఒకే కుటుంబ సభ్యులు. గృహ ప్రవేశానికి హాజరయ్యేందుకు వచ్చారు. మార్గం మధ్యలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతిచెందారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ విషాద ఘటన పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారిలోని వేదాంతపురం వద్ద గురువారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందు కథనం మేరకు... తిరుపతి రూరల్ మండలం ధనలక్ష్మినగర్ క్షత్రియ ఎన్‌క్లేవ్ అపార్టుమెంటులో కాపురముంటున్న బిల్డర్ రాజశేఖర రాజు వేదాంతపురం పంచాయతీ ఎంజీ బ్రదర్స్ లేఅవుట్‌లో నూతనంగా ఇల్లు నిర్మించాడు. గృహ ప్రవేశానికి అన్నమయ్య జిల్లా పుల్లంపేట మండలం రంగంపల్లి నుంచి ఆయన తల్లి సావిత్రి(80), చెల్లెళ్లు సంగీత(38), జ్యోతి, లక్ష్మీదేవి వచ్చారు. టీఎన్ 12-4581 నెంబరు కారులో ధనలక్ష్మినగర్ నుంచి గృహ ప్రవేశం జరుగుతున్న ఎంజీ బ్రదర్స్ లేఅవుట్‌కు బయలుదేరారు. వేదాంతపురం క్రాస్ వద్ద బైపాస్ దాటుతుండగా నల్గొండ నుంచి బెంగళూరుకు వెళుతున్న బాలాజీ ట్రావెల్స్ బస్సు వేగంగా ఢీకొంది. దాదాపు 50 అడుగుల వరకు లాక్కెళ్లడంతో కారు నుజ్జునుజ్జు అయింది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న సావిత్రి, సంగీత తీవ్రంగా గాయపడ్డారు. జ్యోతి, లక్ష్మీదేవి స్వల్పంగా గాయపడ్డారు. వీరిని తిరుపతి రుయాకు తరలించారు. చికిత్స పొందుతూ సావిత్రి, సంగీత మృతి చెందారు. మిగిలిన ఇద్దరి పరిస్థితి కొంత మెరుగ్గా ఉందని పోలీసులు చెప్పారు. సంగీత తిరుపతి రూరల్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ రమేష్ భార్య. కాగా బస్సు డ్రైవర్ సురేష్‌ను అదుపులోకి తీసుకుని బస్సును సీజ్ చేసినట్లు పోలీసులు చెప్పారు. రాజశేఖర్ రాజు తమ్ముడు రాఘవరాజు ఫిర్యాదు మేరకు తిరుపతి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి, బంధువులకు అప్పగించినట్లు సీఐ చెప్పారు.



సప్తగిరులను కప్పేసిన పొగమంచు

తిరుమల శేషాచల కొండలను దట్టమైన పొగమంచు కప్పేసింది. నాలుగు రోజులుగా తిరుపతి, తిరుమలలో వర్షం కురుసున్న విషయం తెలిసిందే. వర్షం నిలిచిపోయిన సందర్భాల్లో పొగ మంచు శేషాచల కొండలపై వాలిపోతోంది. స్వామి దర్శనం కోసం వచ్చే ప్రకృతి ప్రేమికులకు ఆ దృశ్యాలు ప్రత్యేక అనుభూతులను కలిగిస్తున్నాయి. ఘాట్ రోడ్లలో ప్రయాణించే వాహనదారులు తమ వాహనాలను ఆపి మరీ కనులారా తిలకిస్తున్నారు. మరోవైపు తిరుమలలోనూ పొగమంచు కనువిందు చేస్తోంది. తెల్లటి మంచులో స్వామి ఆలయం, పార్కులు, అతిథిగృహాలు ప్రత్యేక అందాలను సంతరించుకున్నారు. స్వామి దర్శనం తర్వాత భక్తులు పొగమంచులో ఆహ్లాదకరంగా గడుపుతున్నారు. ఇక, గురువారం కూడా పలు సందర్భాల్లో చిరుజల్లులు కురిశాయి.

శ్రీసిటీలో నీతి అయోగ్ సీఈవో



సుబ్రమణ్యానికి స్వాగతం పలుకుతున్న శ్రీసిటీ ఎండీ

శ్రీసిటీ, నవంబరు 14: నీతి అయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రమణ్యం గురువారం శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ చైర్మన్ శ్రీనిరాజు, ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఆయనకు సాదర స్వాగతం పలికారు. శ్రీసిటీ ప్రత్యేకతలు, పారిశ్రామిక వృద్ధి సామర్థ్యాన్ని వివరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పరిశ్రమల సీఈవోల సమావేశంలో సుబ్రమణ్యం మాట్లాడుతూ భారతదేశం అన్ని విధాలా వేగంగా దూసుకుపోతున్న ప్రస్తుత తరుణంలో పరిశ్రమల వృద్ధి, స్థాపనకు అత్యంత అనువైన దంటూ పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చారు. దేశంలో అత్యధిక జనాభా, యువత అందుబాటులో ఉందన్నారు. వారిని శ్రామికశక్తిగా మార్చుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఉద్యోగ కల్పన, ప్రాంతీయ అభివృద్ధి, స్థిరమైన ఆర్థికవృద్ధికి కీలకమైన శ్రీసిటీ తరహా పారిశ్రామిక కేంద్రాలకు అన్ని రకాల సహాయ సహకారాలు అందించేందుకు నీతి అయోగ్ కట్టుబడి ఉందని సుబ్రమణ్యం స్పష్టం చేశారు. పరస్పర చర్చల సందర్భంగా నైపుణ్యాభివృద్ధి, ప్రతిభకు ప్రోత్సాహం, పరిశ్రమలకు సమీపంలో కార్మికుల నివాస గృహ సౌకర్యాలకు సంబంధించిన సమస్యలను పరిశ్రమల ప్రతినిధులు లేవనెత్తారు. ఇందుకు సుబ్రమణ్యం సానుకూలంగా స్పందిస్తూ వీటిని కీలకంగా గుర్తిస్తూ విధాన నిర్ణయాల్లో ప్రాధాన్యం ఇస్తామని హామీ ఇచ్చారు.



విలువిద్యలో పోటీపడుతున్న గణేష్ మణిరత్నం

విలువిద్యలో ఆ యువకుడు పట్టువదలని విక్రమార్కుడు. మధ్య తరగతి నేపథ్యమైనా ఇటు విద్యలోనూ అటు క్రీడాకారుడిగా రాణిస్తూ ప్రతిభ చాటుకుంటున్నాడు తరుమూరు గణేష్ మణిరత్నం. ప్రపంచ స్థాయిలో పతకమే లక్ష్యంగా గురి తప్పకుండా కృషి చేస్తున్నాడీ విలువిద్య క్రీడాకారుడు.

\- తిరుపతి(క్రీడలు)



ఏషియన్ ఆర్చరీ యూత్ చాంపియన్‌షిప్‌లో బంగారు పతకాలతో..

విలువిద్యలో 'మణిరత్నం'



నాయుడుపేటలోని భరత్‌నగర్‌కు చెందిన తరుమూరు హరిప్రసాద్ దంపతుల కుమారుడు గణేష్ మణిరత్నం. హరిప్రసాద్ సమీపంలోని టోల్‌ప్లాజాలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నారు. తన కుమారుడి ఆసక్తి గమనించి చదువుతో పాటు క్రీడా రంగంలోనూ ప్రోత్సహించాలని భావించారు. స్నేహితుల సలహాతో విలువిద్య(ఆర్చరీ)ను నేర్పించాలని సంకల్పించారు. 2016లో ఐదవ తరగతి చదువుకుంటున్న మణిరత్నాన్ని విలువిద్య కోచ్ శివశంకర్ దగ్గర చేర్పించారు. తండ్రి ప్రోత్సాహాన్ని అందిపుచ్చుకుని కొన్ని నెలలకే విశాఖపట్నంలోని సంస్కృతి గ్లోబల్‌స్కూల్‌లో శాప్ సెలక్షన్స్‌లో ఎంపికయ్యాడు. శాప్‌కోచ్ సుధాకర్‌నాయుడు దగ్గర రెండేళ్లపాటు శిక్షణ తీసుకున్నాడు. పదవ తరగతి పాస్ అయ్యాక భీమవరంలోని కోచ్ కమల కిషోర్ వద్ద శిక్షణ పొందాడు. మూడేళ్ల శిక్షణ కాలంలో జిల్లాస్థాయిలో పది స్వర్ణ పతకాలు, రాష్ట్రస్థాయిలో ఏడు బంగారు పతకాలు, జాతీయ స్థాయిలో ఒక సిల్వర్, మూడు బ్రాంజ్ పతకాలను కైవసం చేసుకుని, అందరి దృష్టినీ ఆకట్టుకున్నాడు. ఆర్చరీ గుర్తింపు సంపాదించాడు.

ప్రపంచస్థాయి గుర్తింపే లక్ష్యం

వచ్చే ఏడాది నుంచి వరుసగా విలువిద్య వరల్డ్‌కప్, వరల్డ్ చాంపియన్‌షిప్, కామన్వెల్త్, ఏషియా గేమ్స్ జరగనున్నాయి. వీటిలో తప్పకుండా ప్రాతినిధ్యం వహించి రాణిస్తాను. దేశానికి మంచిపేరు తీసుకురావడమే నా ముందున్న ప్రధాన లక్ష్యం.

\- తరుమూరు గణేష్ మణిరత్నం

విదేశాల్లోనూ సత్తా

- 2023లో ఐర్లాండులో జరిగిన యూత్ వరల్డ్ ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో అండర్-18కాంపౌండ్ విభాగంలో సిల్వర్ మెడల్ కైవసం చేసుకున్నాడు. ఇండియా నుంచి ఎంపికైన యువకుల్లో తొలిస్థానం సంపాదించాడు.
- ఈ ఏడాది జూన్‌లో సౌత్‌కొరియాలోని సువాన్‌లో జరిగిన ఏషియాకప్ స్టేజ్-3(వరల్డ్ ర్యాంకింగ్ టోర్నమెంట్)లో వ్యక్తిగతంగా ఐదవ ర్యాంకు, జట్టుతో బ్రాంజ్ మెడల్ సాధించాడు.
- ఈ ఏడాది సెప్టెంబరులో చైనీస్‌తైపైలో జరిగిన ఏషియన్ ఆర్చరీ యూత్ చాంపియన్‌షిప్‌లో వ్యక్తిగతంగాను, గ్రూపులోనూ బంగారు పతకాలు సాధించాడు.



కుటుంబ సభ్యులతో..

ప్రభుత్వమే 108 సర్వీసు నడపాలి

ఉద్యోగులకు పనికి తగిన వేతనం ఇవ్వాలి



సమ్మె నోటీసు చూపుతున్న 108 ఉద్యోగులతో కిరణ్‌కుమార్

తిరుపతి(లీలామహల్), నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): 108 సర్వీసును ప్రభుత్వమే నిర్వహిస్తూ ఈఎంటీ, పైలెట్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కె.కిరణ్‌కుమార్ కోరారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ 108 సర్వీసు కార్పొరేటర్లకు వరంగా మారుతోందన్నారు. గతంలో కాంట్రాక్టర్లకు రూ.300 కోట్లకు పైగా చెల్లించారని తెలిపారు. కాంట్రాక్టర్ మారిన ప్రతిసారీ ఉద్యోగుల జీతభత్యాలు, ఇంక్రిమెంట్లు తదితర సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. ఏ శాఖలోనూ లేనివిధంగా 108 సర్వీసులో రోజుకు రెండు షిఫ్టులుగా 12 గంటల చొప్పున పనులు చేయించుకుని, పనికి తగిన వేతనం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు షిఫ్టుల విధానంతో 8 గంటల చొప్పున పని విధానాలను మార్చాలని, జీతాలు సకాలంలో చెల్లించాలని కోరారు. ఇంక్రిమెంట్లు లేవు, బోనస్‌లు లేకపోయినా విధులు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలో దుస్థితికి చేరిన 108 వాహనాలకు మరమ్మతులు చేయాలన్నారు. సిబ్బంది కొరత తీర్చాలని కోరారు. ప్రతి మండల కేంద్రంలోనూ 108 అంబులెన్స్ సిబ్బందికి శాశ్వత భవనం ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే 25వ తేదీ నుంచి సమ్మెకు వెళతామని స్పష్టం చేశారు. సమావేశంలో మహేష్, సునీల్, మునిరాజు, కేశవులు, సుధాకర్, శ్రీదేవి, ఊహ తదితరులు పాల్గొన్నారు.

4 నుంచి ఎస్వీయూలో డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్శిటీ పరిధిలో డిగ్రీ 3, 5వ సెమిస్టర్ పరీక్షలు డిసెంబర్ 4వ తేదీ నుంచి నిర్వహించనున్నారు. ఉదయం, మధ్యాహ్నం రెండు పూటలా పరీక్షలు నిర్వహిస్తారు. ఇందుకు సంబంధించిన షెడ్యూల్ గురువారం విడుదలైంది. 4 నుంచి 28వ తేదీ వరకు పరీక్షలు కొనసాగుతాయి. పరీక్షల సమాచారాన్ని ఆయా కాలేజీలకు పంపినట్లు సీఈ దామ్లానాయక్ తెలిపారు.

జర్మనీ భాషపై శిక్షణ

తిరుపతి(కలెక్టరేట్) నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఎస్ఎం కేర్ సొల్యూషన్ సహకారంతో జర్మనీ భాషపై, నర్సింగ్ ఉద్యోగాల కల్పనపై శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి లోకనాథం తెలిపారు. జీఎన్ఎం బీఎస్సీ నర్సింగ్ కలిగి ఉండాలని, మరిన్ని వివరాలకు 99888 53335ను సంప్రదించాలని తెలిపారు.

19న నగరిలో జాబ్‌మేళా

నగరి, నవంబరు 14: నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 19వ తేదీన జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ వేణుగోపాల్ తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఎక్ఛేంజ్, సీడాప్, డీఆర్‌డీఏ, కళాశాల జవహర్ నాలెడ్జ్ సెంటర్ సంయుక్తంగా ఈ మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కాన్వే జీనియస్, ఆల్‌సెట్ బిజినెస్ సొల్యూషన్స్, హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్ , ఐఐఎఫ్ఎల్ ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. ఐటీఐ, డిగ్రీ ఫెయిల్ లేదా పాస్, బీటెక్ చేసిన 18-30 ఏళ్లలోపువారు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు జిరాక్స్ కాపీలను సైతం తేవాలని సూచించారు.

20న పాత పరికరాల వేలం

చిత్తూరు సిటీ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు ఎక్సైజ్ డిపో పరిధిలోని పాత పరికరాలను వేలం వేయనున్నట్లు డిపో మేనేజర్ మనోహర్ తెలిపారు. గతంలో ప్రభుత్వ మద్యం దుకాణాల్లో వినియోగించిన 88 ఫ్రీజర్లు, 86 ఇన్వర్టర్లు, బ్యాటరీలు,88 క్యాష్ చెస్ట్ 85 క్యాష్ కౌంటింగ్ మిషన్లు, 112 స్కానర్లు వేలం వేయనున్నట్లు పేర్కొన్నారు. 20వ తేది ఉదయం 10.30 గంటలకు పూతలపట్టు మండలం వడ్డేపల్లె సమీపంలోని ఎక్సైజ్ డిపోలో వేలం వేస్తారని తెలిపారు. వివరాలకు 9177887729, 7780566131, 9949351040 నెంబర్లను సంప్రదించాలని డీఎం ఆ ప్రకటనలో తెలిపారు.





పుష్కరిణి వద్ద ఏర్పాటు చేసిన విద్యుద్దీపాలంకరణ - దేవతామూర్తుల విద్యుత్ దీపాలంకరణ

తిరుచానూరు బ్రహ్మోత్సవాలకు శరవేగంగా ఏర్పాట్లు

తిరుచానూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు ఈనెల 28వ తేదీ ధ్వజారోహణంతో ప్రారంభం కానున్నాయి. తొమ్మిది రోజుల పాటు జరగనున్న ఈ ఉత్సవాలకు సంబంధించి టీటీడీ అధికారులు శరవేగంగా ఏర్పాట్లు చేస్తున్నారు. విద్యుత్ దేవతామూర్తుల కటౌట్లు, తిరుపతి నుంచి తిరుచానూరు వరకు విద్యుత్ దీపాలంకరణలు చేపట్టారు. ఆలయ పరిసరాలతో పాటు గ్రామం మొత్తం విద్యుత్ దీపాలంకరణలు చేస్తున్నారు. భక్తులు వేచి ఉండేందుకు నవజీవన్ ఆస్పత్రి సమీప ప్రాంతాలతో పాటు ప్రైవేటు, తోలప్పగార్డెన్ బస్టాండ్ల వద్ద ఇనుప షెడ్లు సిద్ధం చేస్తున్నారు. డిసెంబరు 6న బ్రహ్మోత్సవాల్లో చివరి ఘట్టమైన పంచమి తీర్థం జరగనుంది. ఈ ఉత్సవానికి దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు తరలిరానున్నారు. ఈ నేపథ్యంలో పుష్కరిణిలో పాత నీటిని తొలగించి కొత్తవి నింపనున్నారు. తొక్కిసలాట లేకుండా బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఉత్సవాల ఏర్పాట్లపై విమర్శలు వచ్చిన నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాట్లు చేస్తోంది.

నకిలీ డాక్యుమెంట్లతో ప్రొఫెసర్‌కు టోకరా

- నలుగురిపై చీటింగ్ కేసు

రేణిగుంట, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి రిజిస్ట్రేషన్ చేసిన నలుగురిపై గాజులమండ్యం పోలీసులు గురువారం చీటింగ్ కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు ఎస్వీ యూనివర్శిటీ ప్రొఫెసర్ సహదేవ్ తిరుపతి ఎమ్మార్‌పల్లిలో ఉంటున్నారు. రామచంద్రనగర్‌కు చెందిన సురేంద్ర, వెంకటసిద్దయ్య, వెంకటచెంచయ్య, భార్య రాజేశ్వరి కలిసి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుంటారు. వీరందరూ 2015లో రేణిగుంట మండలం తూకివాకం పంచాయతీ పరిధిలోని ఎర్రంరెడ్డిపాళెం లెక్క దాఖల సర్వే నెంబరు 526/6ఏలో 170 అంకణాల విస్తీర్ణమున్న 4 ప్లాట్లను రూ.52 లక్షలకు విక్రయించి రిజిస్ట్రేషన్ చేశారు. ఈ స్థలాన్ని గతేడాది కొనుగోలు చేసిన ప్రొఫెసర్ సహదేవ్ కాంపౌండ్ వాల్ నిర్మించేందుకు స్థలం వద్దకు వచ్చి పరిశీలిస్తుండగా చంద్ర అనే వ్యక్తి ప్రశ్నించాడు. ఈ స్థలం రిజిస్ట్రేషన్ చేసుకున్నామని ప్రొఫెసర్ చెప్పడంతో స్థల యజమాని అవాక్కయ్యాడు. ఎవరో మోసం చేశారని ..విచారించుకోవాలని సూచించడంతో సహదేవ్ కంగుతిన్నారు. రేణిగుంట తహసీల్దారు కార్యాలయంలో సంప్రదించారు. వారు సర్వే నిర్వహించి చంద్ర అనే పేరుపై రిజిస్టర్ అయిందని తెలపడంతో ప్రొఫెసర్ నిర్ఘాంతపోయారు. మోసపోయానని గుర్తించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో 2023లో పోలీస్‌స్టేషన్ల చుట్టూ న్యాయం చేయాలని కోరినా పట్టించుకోలేదు. ఎస్పీ సుబ్బరాయుడుకు తాజాగా ఫిర్యాదు చేశారు. ఈనేపథ్యంలో నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి రిజిస్ట్రేషన్ చేసిన నలుగురిపై గురువారం గాజులమండ్యం పోలీస్‌స్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదు అయింది.



తుడా ఎవరికి?

తిరుపతి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): తుడా చైర్మన్ పదవికి ఎవరికి దక్కుతుందనేది జిల్లావ్యాప్తంగా చర్చకు దారితీస్తోంది. ఇప్పటికే రాష్ట్రస్థాయిలో ముఖ్యమైన నామినేటెడ్ పదవులు చాలావరకూ భర్తీ అయిన సంగతి తెలిసిందే. తుడా చైర్మన్ పదవిని అటు టీడీపీ, ఇటు జనసేన పార్టీల నుంచీ పలువురు ఆశించి పోటీ పడుతుండడంతో ప్రతిష్టంభన నెలకొంది. టీటీడీ ఎక్స్ అఫిషియో సభ్యత్వం పేరిట అదనపు హోదా తోడవుతున్నందున పలువురి కన్ను తుడా చైర్మన్ పదవిపై పడుతోంది. ఇతర పదవులు దక్కని వారు కూడా దీనికోసం రేసులో నిలుస్తున్నారు. ఆలస్యమయ్యే కొద్దీ ఈ పదవికి పోటీ మరింత పెరుగుతోంది. ఈ నేపథ్యంలో టీడీపీ అధినేత నిర్ణయం కోసం అంతా ఎదురు చూస్తున్నారు.

టీడీపీ రేసులో పలువురు

తిరుపతి ఎమ్మెల్యే, ఎంపీ స్థానాలు రెండూ కూటమి భాగస్వామ్య పక్షాలకు కేటాయించిన కారణంగా తిరుపతిలో పార్టీ పటిష్టంగా ఉండాలంటే తుడా చైర్మన్ పదవి టీడీపీ ఖాతాలోనే ఉండాలని ఆ పార్టీ స్థానిక నాయకులు ఆశిస్తున్నారు. తొలినుంచీ ఈ పదవికి జిల్లా టీడీపీ అధ్యక్షుడు నరసింహ యాదవ్, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోడూరు బాలసుబ్రమణ్యం, ముబ్బు దేవనారాయణ రెడ్డి, డాలర్స్ దివాకర్‌రెడ్డి, శ్రీకాళహస్తికి చెందిన ఓ కాంట్రాక్టర్ పేర్లు ప్రచారంలో ఉన్నాయి. అయితే నరసింహ యాదవ్‌కు యాదవ సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇచ్చినప్పటికీ ఆయన ఆ పదవి పట్ల సంతృప్తిగా లేరని సమాచారం. తనకు తుడా చైర్మన్‌గా అవకాశం కల్పించాలని కోరినట్లు పార్టీ వర్గాల సమాచారం. దీంతో ఆయన మళ్లీ రేసులోకి వచ్చినట్టయింది. టీటీడీ బోర్డు మెంబరు పదవి ఆశించి నిరాశకు గురైన పార్టీ మీడియా కో ఆర్డినేటర్ శ్రీధర్ వర్మ పేరు కూడా పార్టీ పరిశీలిస్తున్న జాబితాలో చేరింది. ప్రస్తుత దశలో వీరందరితో పాటు చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, ఆయన సతీమణి సుధారెడ్డిల పేర్లు కూడా అధిష్ఠానం పరిశీలనలో ఉన్నట్టు ఆ వర్గాలు చెబుతున్నాయి.

జనసేన నుంచి తీవ్ర పోటీ

జనసేన పార్టీ నుంచీ జిల్లా అధ్యక్షుడు పసుపులేటి హరిప్రసాద్, తిరుపతి ఇన్‌చార్జి కిరణ్ రాయల్ ఇద్దరూ తుడా చైర్మన్ పదవి ఆశించారు. అయితే హఠాత్తుగా నిర్మాత ఎన్‌వీ ప్రసాద్ పేరు తెరపైకి వచ్చింది. ఆయన కోసం మెగాస్టార్ చిరంజీవి గట్టిగా పట్టుబడుతున్నారనే ప్రచారం సాగుతోంది. మరోవైపు చిత్తూరు మాజీ ఎంపీ దివంగత డీకే ఆదికేశవులు నాయుడు మనవరాలు చైతన్య పేరు కూడా ప్రచారంలో ఉంది. ఇప్పటికే ఆమె పవన్ కల్యాణ్, చంద్రబాబు, లోకేశ్‌లు ముగ్గురినీ కలసి తనకు అవకాశం కల్పించాలని కోరినట్లు ఇరు పార్టీల వర్గాలూ చెబుతున్నాయి. అయితే చైతన్యకు కాకుండా ఆమె తల్లికి ఏదో ఒక పదవి కేటాయిస్తామంటూ అధినేతలు నచ్చజెప్పినట్లు ప్రచారం జరుగుతోంది. శ్రీకాళహస్తికి చెందిన ఓ టీడీపీ ముఖ్యనేత ఆమెకు తుడా చైర్మన్ పదవి ఇవ్వడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

టీడీపీ అధినేత నిర్ణయంపై ఉత్కంఠ

ఇంతకీ తుడా పదవి టీడీపీ వారికా, జనసేనకా అనే చర్చ జోరుగా సాగుతోంది. జనసేనాని పవన్ కళ్యాణ్ తమ పార్టీకి కావాలని గట్టిగా పట్టుబట్టని పక్షంలో టీడీపీ వారికే దక్కుతుందని ఆ వర్గాలు చెబుతున్నాయి. అధినేత నుంచీ సూచనప్రాయంగా కూడా ఎలాంటి సంకేతాలూ అందకపోవడంతో దీనిపై ప్రత్యేకించి తిరుపతి, చంద్రగిరి నియోజకవర్గాల టీడీపీ, జనసేన వర్గాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంటోంది. అధినేత నిర్ణయం ఎలా ఉన్నా ఇక్కడి నేతలు శిరసావహించే పరిస్థితి ఉంది. అయితే ఆ నిర్ణయమే తిరుపతిలో టీడీపీ భవిష్యత్తును నిర్ణయించనుంది. అందుకే చంద్రబాబు తీసుకునే నిర్ణయం కోసం రాజకీయ వర్గాలతో పాటు ఈ ప్రాంత ప్రజానీకం సైతం ఆసక్తిగా ఎదురుచూస్తోంది.

సిపాయికి మండలి ప్యానల్ వైస్ చైర్మన్ పదవి



తిరుపతి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): తిరుపతికి చెందిన రుష్ ఆస్పత్రి అధినేత, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం శాసనమండలి ప్యానల్ వైస్ చైర్మన్‌గా నియమితులయ్యారు. మండలిలో బుధవారం ఈ నియామకం జరిగింది. ఎమ్మెల్సీగా నియామకమైన మొదటి ఏడాదిలోనే ఆయన ప్యానల్ వైస్ చైర్మన్‌గా నియమితులు కావడం పట్ల వైసీపీ వర్గీయులు, ఆయన అనుచరులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



పొగమంచు కమ్మి నులివెచ్చని చలిమొదలయ్యే కార్తీక మాసంలో సమస్త ప్రకృతీ సౌందర్యంతో కళకళలాడుతుంది. శివుడికి ఇష్టమైన కాలంగా దీనిని భావిస్తారు. దీపావళి మరుసటి రోజు నుంచీ కార్తీక మాసం మొదలవుతుంది. ఈ నెలలో వచ్చే సోమవారాలు విశిష్టమైనవి. జిల్లాలోని శివాలయాలన్నీ భక్తులతో కిటకిటలాడుతున్నాయి. ఉసిరి చెట్టు కింద దీపారాధనలు, వనభోజనాలు విరివిగా సాగుతున్నాయి. కొండకోనలూ, జలపాతాలూ సందర్శకులతో సందడిగా మారాయి. నేడు కార్తీక పౌర్ణమి కావడంతో ప్రత్యేక పూజలు జరుగుతాయి. జిల్లాలో కార్తీక మాసంలో భక్తులు పెద్ద సంఖ్యలో సందర్శించే ఆలయాల విశేషాలు ఇవీ...

నేడు శివాలయాల్లో కార్తీక పౌర్ణమి పూజలు

కార్తీక వేళ..



గిరింపేట చిదంబరేశ్వర ఆలయంలో భక్తుల మొక్కులు

నీవానది వద్ద సందడి

చిత్తూరు నగరంలోని ఇరువారం నాగేంద్రస్వామి, కామాక్షి అంబికా సమేత అగస్తీశ్వరాలయం, నీవానది కాశీ విశ్వేశ్వర (రాజుగుడి), కట్టమంచి కుళందేశ్వర ఆలయాలను కార్తీక మాసంలో భక్తులు ప్రత్యేకంగా సందర్శిస్తారు. కార్తీకమాసంలో ప్రతి సోమవారం ప్రత్యేక పూజలు జరుగుతాయి.

-చిత్తూరు కల్చరల్, ఆంధ్రజ్యోతి

నెక్కొంది కొండ

పుంగనూరు మండలం నెక్కొంది కొండపై క్రీ.శ. 921లో చోళ రాజులు నిర్మించిన అగస్తీశ్వర స్వామి ఆలయం కార్తీకమాసంలో భక్తులతో కిటకిటలాడుతుంది. కొండపై భారీ పుష్కరిణి, 16 స్తంభాలు, 16 మెట్లతో స్వామి వారి కళ్యాణమండపం ఉంటాయి. ఇక్కడ సుబ్రమణ్యస్వామి, వినాయకుడు, చౌడేశ్వరీ దేవి, ప్రసన్న పార్వతీదేవి, కాశీవిశ్వేశ్వర స్వామి, చండీశ్వరాలయం, వీరభద్రుడు, భద్రకాళీ ఆలయాలను కార్తీకమాసంలో పుంగనూరు పరిసర ప్రాంతాల్లోని ప్రజలు ఉపవాస దీక్షలతో సందర్శించి మొక్కులు చెల్లించుకుంటారు. కొండపైన ఆలయం వద్ద రాత్రి నిద్ర చేసి పుష్కరిణిలో స్నానం చేస్తారు. కర్ణాటక, తమిళనాడునుంచి కూడా అధిక సంఖ్యలో వస్తుంటారు. పుంగనూరు నుంచి రాయలపేట రోడ్డు, చౌడేపల్లె నుంచి నెక్కొంది రోడ్డు, పలమనేరు నుంచి చౌడేపల్లె మార్గాల్లో ఆలయానికి చేరుకోవచ్చు.ఈ మార్గాలన్నీ 20 కిలోమీటర్ల లోపే ఉన్నాయి. కొండపైకి రోడ్డు సౌకర్యం ఉంది.

- పుంగనూరు, ఆంధ్రజ్యోతి





అగస్తీశ్వర స్వామి ఆలయం

400 ఏళ్ల మర్రిచెట్టు

పాలసముద్రం మండలంలోని శ్రీబొమ్మరాజు పురం (రాచపాళ్యం)లో 400 ఏళ్ల వయసున్న మర్రిచెట్టు కింద కార్తీక సోమవారాల్లో వనభోజనాలు జరుగుతాయి. రెండెకరాల్లో విస్తరించిన ఈ మర్రి మహావృక్షం ఎంతో అందంగా ఉంటుంది. ఈ చెట్టు కింద పంచమూర్తుల ఏకశిలా విగ్రహానికి పూజలు చేస్తారు. ఇక్కడే ఉన్న ఉసిరిచెట్టు కింద దీపాలు వెలిగిస్తారు. కార్తీక పౌర్ణమి రోజు 60 కిలోల నెయ్యి దీపాన్ని వెలిగిస్తారు. ఇది వారం నుంచి 10 రోజుల పాటు వెలుగుతూనే ఉంటుంది. ఆలయం చుట్టూ 101 నెయ్యి దీపాలను ఏర్పాటు చేస్తారు. ఈ దృశ్యం అద్భుతంగా ఉంటుంది. చిత్తూరుకు 33 కిలోమీటర్ల దూరంలో ఈ ప్రదేశం ఉంది.

- పాలసముద్రం, ఆంధ్రజ్యోతి

కాశీవిశ్వేశ్వరుడికి పున్నమి దీపం

రామకుప్పంలోని పురాతన కాశీవిశ్వేశ్వరాలయలంలో కార్తీకమాసంలో సోమవారోత్సవాలు నేత్రపర్వంగా జరుగుతాయి. ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారికి అర్చనలు చేయిస్తారు. కార్తీకదీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకుంటారు. కార్తీక పౌర్ణమి రాత్రి ఆలయ ధ్వజస్తంభంపై కార్తీక దీపాన్ని వెలిగిస్తారు.

-రామకుప్పం, ఆంధ్రజ్యోతి



రామకుప్పంలోని కాశీవిశేశ్వరాలయం

మొగిలి దేవరకొండ బురుజుపై కార్తీక దీపం



మొగిలీశ్వర ఆలయం కార్తీకమాసంలో భక్తులతో కిటకిటలాడుతుంది. మహిళలు ఆలయ ఆవరణలో బియ్యపు పిండితో చేసిన ప్రమిదలు వెలిగించి దీపారాధన చేస్తారు. అలాగే దేవరకొండలోని జలకంఠేశ్వరస్వామికి కార్తీక సోమవారాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. దీపారాధన, అభిషేక పూజలు నిర్వహించి భక్తులకు నిత్యాన్నదానం చేస్తారు.కార్తీక పౌర్ణమి రోజున మొగిలి దేవరకొండలోని బురుజుపై కార్తీక దీపాన్ని వెలిగిస్తారు.కర్ణాటక, తమిళనాడు నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు.

-బంగారుపాళ్యం, ఆంధ్రజ్యోతి



మొగిలీశ్వరాలయంలో దీపారాధన చేస్తున్న భక్తులు

యాదమరి శివాలయం

యాదమరిలోని వరదరాజులస్వామి ఆలయం అభిముఖంగా శివాలయం ఉండడం విశేషం. ప్రాంగణంలో గణపతి, కుమారస్వామి, సుబ్రహ్మణ్యస్వామి, కాలభైరవ ఆలయం, నాగుల విగ్రహాలు, శనీశ్వరుని ఉపఆలయాలు ఉన్నాయి. కార్తీకమాసంలో ప్రత్యేక పూజలు చేస్తారు. సోమవారం రుద్రాభిషేకం చేస్తారు. సరిహద్దు ప్రాంతం కావడంతో స్థానికులతో పాటు తమిళ ప్రజలు అధిక సంఖ్యలో వస్తారు. కార్తీక పౌర్ణమినాడు స్వామి, అమ్మవార్ల గ్రామోత్సవం నిర్వహిస్తారు. చిత్తూరు నుంచి 10 కిలోమీటర్ల దూరంలో ఈ ప్రదేశం ఉంది.

- యాదమరి, ఆంధ్రజ్యోతి




నాగలకట్టె

మృత్యుగండాలను తొలగించే స్వామి

చౌడేపల్లిలో 400 ఏళ్ల కిందట పుంగనూరు జమిందారు రాజ చిక్కరాయలు మృత్యుంజయేశ్వరస్వామి ఆలయాన్ని నిర్మించారు. మృత్యు గండాల నుంచి గట్టెక్కించే స్వామిగా ఈయనను కొలుస్తారు. అనారోగ్యంతో ఉన్నవారు ఆలయంలో అఖండ దీపాన్ని వెలిగించి మొక్కులు తీర్చుకుంటారు. కార్తీకమాసంలో ఉదయాన్నే భక్తులు మాఘస్నానాలు ఆచరించి స్వామి వారిని సేవించటం ఆనవాయితీ. తిరుపతి నుంచి పుంగనూరుకు వెళ్లే బస్సులు చౌడేపల్లె మీదుగానే వెళ్తాయి. చిత్తూరు నుంచి పలమనేరుమీదుగా చౌడేపల్లెకు చేరుకోవచ్చు.

- చౌడేపల్లె, ఆంధ్రజ్యోతి



మృత్యుంజయేశ్వరస్వామి ఆలయం



దుర్గం కొండపై పుష్కరిణి, గాలిగోపురం



దుర్గంకొండలో శివమాల ధరించిన భక్తులు

దుర్గం కొండలో గార్గేయ మునీశ్వర ఆలయం

సోమల మండలం పెద్దఉప్పరపల్లె సమీపంలోని దుర్గంకొండ పైన సామంతరాజులు నిర్మించిన పార్వతీదేవి, శివాలయం ఉన్నాయి. ఇక్కడి గుహలో గార్గేయ మహర్షి తపస్సు చేయడానికి శివలింగాన్ని ప్రతిష్ఠించుకుని పూజలు చేసేవారని చెప్పుకుంటారు. ఈ కొండపైనున్న కొలనులో ఎంతటి కరువులోనూ నీళ్లుండడం విశేషం. పంటలు బాగా పండుతాయనే నమ్మకంతో ఈ నీటిని ఈ ప్రాంత ప్రజలు తమ పొలాల్లో చల్లుకుంటారు. కార్తీకమాసం ప్రారంభంతో మునీశ్వరస్వామి సన్నిధిలో వందలాది మంది భక్తులు శివమాల ధరించడం ఆనవాయితీ. సోమల నుంచి పెద్దఉప్పరపల్లెకు 14కి.మీ దూరం.

- సోమల, ఆంధ్రజ్యోతి

ఈ ప్రచార పిచ్చి తొలగింపు ఖర్చెంత?

● 3,33,066 సర్వేరాళ్లపై జగన్ పేరు తొలగింపునకు టెండర్లు



భూసర్వే వివరాలు

రీసర్వే గ్రామాలు	329
విస్తీర్ణం (ఎకరాల్లో)	302555.253
పాతిన రాళ్లు	333066

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ పాలకులు తీసుకున్న నిర్ణయాలు అన్నదాతల పాలిట శాపంగా మారాయి. గ్రామాల్లో భూమి రీసర్వే చేపట్టి ఎల్పీ నెంబర్లు తీసుకుని వచ్చింది. ఈ నెంబర్ల తయారులో ఎన్నో తప్పొప్పులు జరిగాయి. రెవెన్యూ రికార్డులకు పొంతన లేకపోవడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారపగ్గాలు చేపట్టిన వెంటనే భూరీసర్వే ప్రక్రియను తాత్కాలికంగా ఆపేసిన సంగతి తెలిసిందే. పనిలో పనిగా భూహక్కు పత్రాల స్థానంలో పాతపద్ధతిలోనే రాజముద్రతో పట్టాదారు పాసుపుస్తకాలు అందివ్వాలని సంకల్పించారు. ఈ క్రమంలోనే సరిహద్దురాళ్లపై ఉన్న 'వైఎస్ఆర్ జగనన్న భూరక్ష' అని ముద్రించిన పేర్లను తుడిపేసేందుకు జిల్లా యంత్రాంగం స్థాయిలో తీవ్ర కసరత్తు సాగుతోంది. ఇందుకు ప్రత్యేక టెండర్‌ను కూడా పిలిచింది. జిల్లాలో 329 గ్రామాల్లో 302555.253 ఎకరాల్లో భూరీసర్వే జరిగింది. రీసర్వే జరిగిన గ్రామాల్లో 333066 సర్వేరాళ్లను పాతారు. ప్రభుత్వ ఆదేశాలను అనుసరించి రాళ్లపై ఉన్న జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష అనే పేరును తొలగించేందుకు నిర్ణయించింది. ఒక్కో సర్వేరాయిపై ఉన్న ఈ పేరును తొలగించేందుకు రూ.15 ధర నిర్ణయించింది. ఇందుకు సంబంధించి శుక్రవారంతో టెండర్ డాక్యుమెంట్ అమ్మకానికి గడువు ముగియనుంది. ఈనెల 18వ తేదీతో టెండర్ స్వీకరణకు చివరి తేదీగా జిల్లా యంత్రాంగం నిర్ణయించింది.

టీడీపీ నాయకుడి మృతి



సంపత్ (ఫైల్ ఫొటో)

గంగాధరనెల్లూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గంగాధర నెల్లూరు మండలంలోని పెద్దకాల్వ పంచాయతీ మిట్టదళితవాడకు చెందిన టీడీపీ మాజీ జిల్లా కార్యదర్శి సంపత్ (70) అనారోగ్యంతో బాధపడుతూ గురువారం రాత్రి చిత్తూరులో మరణించారు. కొంతకాలంగా కిడ్నీవ్యాధితో బాధపడుతూ చికిత్స తీసుకున్నారు. సంపత్ సతీమణి మేరిరాణి పెద్దకాల్వకు ఎంపీటీసీగా పనిచేశారు. వైసీపీ ప్రభుత్వం హయాంలో టీడీపీ అధినేత చంద్రబాబు అక్రమ అరెస్టుపై చేపట్టిన నిరసనలో అనారోగ్యంతో ఉన్నప్పటికీ పాల్గొన్నారు. శుక్రవారం మిట్టదళితవాడలో అంత్రక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబీకులు తెలిపారు.



ధ్వంసమైన టమోటా పంటను చూపిస్తున్న అరుణ

పంటలపై ఏనుగుల విధ్వంసం

కల్లూరు, నవంబరు14(ఆంధ్రజ్యోతి):పులిచెర్ల మండలం వెంకటదాసరపల్లి పంచాయతీలో బుధవారం రాత్రి పంటలపై ఏనుగుల విధ్వంసం సృష్టించాయి. దీంతో టమోటా, వరి అరటి, బొప్పాయి పంటలకు అపారనష్టం వాటిల్లింది. సోమల మండలం సూరయ్యగారిపల్లి పంచాయతీ కరకమందకు చెందిన మురళి, రాజమ్మ, లత, అరుణ సువారపువారిపల్లి సమీపంలో 10 ఎకరాల్లో టమోటా పంట సాగు చేశారు. ప్రస్తుతం టమోటా కోతలు కొనసాగుతున్నాయి. అయితే బుధవారం రాత్రి ఏనుగుల గుంపు టమోటా పంటను ధ్వంసం చేశాయి. టమోటా తోటలో ఏర్పాటు చేసుకున్న పూరిపాకను దొర్లించిన ఏనుగులు అరటి, బొప్పాయి చెట్లను విరిచేశాయి. సమీపంలో ఉన్న మొహర్‌ఖాన్, జయరామయ్యకు చెందిన వరిపంటలను ఏనుగులు ధ్వంసం చేశాయి. ధ్వంసమైన పంటలను ఎఫ్‌బీఓ శ్రీదేవి పరిశీలించారు.

సహకార వారోత్సవాలు ప్రారంభం



సహకార పతాక ఆవిష్కరణ చేస్తున్న డీసీవో నాగవర్ధన

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఆవరణంలో 71వ అఖిల భారత సహకార వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. సప్తవర్ణాలు కల్గిన సహకార జెండాను డీసీవో నాగవర్ధన ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ.. వికసిత్ భారత్ నిర్మాణంలో సహకార సంఘాల పాత్ర అంశంపై ఈనెల 20వ తేదీ వరకు అన్ని సహకార సంఘాల్లో వారోత్సవాలు జరుగుతాయని చెప్పారు. ఈనెల 30వ తేదీలోగా అన్ని సింగిల్ విండోల్లో కంప్యూటరీకరణ పూర్తిచేసేందుకు చర్యలు చేపట్టామని వివరించారు. డీసీసీ బ్యాంకు సీఈవో మనోహర్ గౌడ్, జిల్లా సహకార ఆడిట్‌అధికారి బ్రహ్మానంద రెడ్డి, డీఎల్‌సీవో వనజ ప్రసంగించగా, ఓఎస్డీ నారాయణమ్మ, డీసీసీబీ డీజీఎంలు శంకర్ బాబు, లిల్లీ కేథరిన్, వెంకటాచలపతి, సహకార విద్యా అధికారి సుధాకర్, బ్యాంకు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తవణంపల్లె పోలీసుస్టేషన్‌లో ఎస్పీ తనిఖీలు



పోలీసు సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎస్పీ మణికంఠ చందోలు

తవణంపల్లె, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): తవణంపల్లె పోలీసు స్టేషన్‌ను ఎస్పీ మణికంఠ గురువారం తనిఖీ చేశారు. పోలీసు స్టేషన్ నిర్వహణ, పరిసర ప్రాంతాలు, సిబ్బంది పనితీరు, ముఖ్యమైన కేసులు దర్యాప్తు, రోడ్డు ప్రమాదాల నియంత్రణకు తీసుకున్న చర్యలు, తదితరాలను పరిశీలించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. బ్లాక్ స్పాట్స్ దగ్గర రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. సమన్లు, నాన్ బెయిల్‌బుల్ వారెంట్లు పెండింగ్‌లో ఉంచకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మహిళా పోలీసులు ఇంటింటికీ వెళ్లి సైబర్ నేరాలు, కొత్త చట్టాలపై అవగాహన కల్పించాలన్నారు. చిత్తూరు వెస్ట్ సీఐ శ్రీధర్‌నాయుడు, తవణంపల్లె ఎస్ఐ చిరంజీవి, సిబ్బంది పాల్గొన్నారు.

కిడ్నీ సమస్యతో బాధపడుతున్నా.. ఆదుకోండి



బైరెడ్డిపల్లె, నవంబరు14(ఆంధ్రజ్యోతి): కిడ్నీ సమస్యతో బాధపడుతున్న తనకు దాతలు స్పందించి ఆదుకోవాలని మండలంలోని చిన్నపురం గ్రామానికి చెందిన చిరంజీవి వేడుకుంటున్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన చిరంజీవి 13 యేళ్లుగా కిడ్నీసమస్యతో బాధపడుతూ డయాలసిస్ కూడా చేసుకుంటున్నారు. ప్రభుత్వం ద్వారా పింఛన్ అందుతున్నప్పటికీ రెక్కాడితేగాని డొక్కాడని ఇతడికి భార్య, కుమారుడు ఉన్నారు. మెరుగైన వైద్యం, మందుల ఖర్చులకు ప్రభుత్వంతో పాటు దాతలు ఆర్థికసాయం అందజేసి ఆదుకోవాలని చిరంజీవి కోరుతున్నారు.

పిడుగుపడి ఆవు మృతి



బంగారుపాళ్యం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పిడుగుపడి ఓ పాడి ఆవు మృతి చెందింది. వెలుతురుచేను పంచాయతీ పులిమడుగుకు చెందిన ధనలక్ష్మి తన పాడిఆవును ఇంటిపక్కనే ఉన్న సొంత పొలంలో మేపుతోంది. గురువారం సాయంత్రం ఉన్నట్టుండి ఉరుములు,మెరుపులతో కూడిన వర్షంతో కూడిన పిడుగుపడడంతో 70వేల విలువైన పాడిఆవు మృతి చెందింది. ప్రభుత్వం ఆదుకోవాలని తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

గ్రీన్ అంబాసిడర్లకు పెండింగ్ జీతాలివ్వాలి



జడ్పీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

చిత్తూరు రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రీన్ అంబాసిడర్లకు పెండింగ్ జీతాలు చెల్లించాలని ఏఐటీయూసీ, గ్రీన్ అంబాసిడర్ల యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం జడ్పీ కార్యాలయం ఎదుట ఈ మేరకు ధర్నా నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ.. 12 నెలల నుంచి 20 నెలల వరకు జీతాలు చెల్లించకుంటే ఎలా బకతాలని ప్రశ్నించారు. అలాగే వారిపై రాజకీయ వేధింపులు కూడా మానుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు నాగరాజు, జనార్ధన్, జయకుమారి, రఘు, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.


వరసిద్ధుడి హుండీ ఆదాయం రూ.1.31 కోట్లు



ఈవో గురుప్రసాద్ పర్యవేక్షణలో హుండీ కానుకలు లెక్కిస్తున్న సిబ్బంది

ఐరాల(కాణిపాకం), నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.1,31,12,759 ఆదాయం లభించింది. ఆలయ ఆస్థాన మండపంలో గురువారం స్వామి కానుకాలను ఈవో గురుప్రసాద్ పర్యవేక్షణలో సిబ్బంది లెక్కించారు. 19 గ్రాముల బంగారు, కిలో 420 గ్రాముల వెండితో పాటు 376 యూఎస్ఏ డాలర్లు, 75 యూఏఈ దిర్హామ్స్, 10 మలేషియా రింగిట్స్, 75 ఇంగ్లాండ్ పౌండ్లు, 60 యూరోలు లభించాయి. వీటితోపాటు గోసంరక్షణ హుండీ ద్వారా రూ.11,360, భక్తుల సౌకర్యార్థం అన్నదాన సత్రం ఏర్పాటు చేసిన హుండీ ద్వారా రూ.28,646 లభించాయి. ఈ ఆదాయం 22 రోజుల్లో సమకూరింది. ఏఈవోలు రవీంద్రబాబు, ఎస్వీ కృష్ణారెడ్డి, హరిమాధవరెడ్డి, ధనంజయ, పర్యవేక్షకులు కోదండపాణి, వాసు, హుండీ ఇన్‌స్పెక్టర్ సుబ్రహ్మణ్యంనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ డిప్యూటీ సీఎంపై పోలీసులకు ఫిర్యాదు



కార్వేటినగరం సీఐకి ఫిర్యాదు చేస్తున్న యుగంధర్

వెదురుకుప్పం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామిపై పోలీసు కేసు నమోదు చేయాలంటూ కార్వేటినగరం సీఐ హనుమంతప్పకు గురువారం జీడీనెల్లూరు జనసేన ఇన్‌చార్జి డాక్టర్ యుగంధర్ పొన్న ఫిర్యాదు చేశారు. ఎన్నికలకు ముందు జనసేన అధినేత పవన్‌కల్యాణ్, టీడీపీ అధినేత చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేశారని.. వాటి ఆధారంగా మాజీ డిప్యూటీ సీఎంపై కేసు నమోదు చేయాలని జనసైనికులతో కలిసి డిమాండ్ చేశారు.

108 ఉద్యోగుల సమ్మె నోటీసు అందజేత

చిత్తూరు రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): 108 సిబ్బంది ఈనెల 25వ తేదీనుంచి సమ్మెలోకి వెళ్తున్నారు. ఈ సందర్భంగా గురువారం డీఎంహెచ్‌వో ప్రభావతిదేవికి, చిత్తూరు తహసీల్దార్ కళావతి తదితరులకు సమ్మె నోటీసు అందజేశారు.

బడుగుమాకుపల్లెలో వైద్యపరీక్షలు

శాంతిపురం : కెనమాకులపల్లె పంచాయతీ బడుగుమాకుపల్లెలో గురువారం డాక్టరు ప్రసాద్ ఆధ్వర్యంలో ఆరోగ్య సర్వే జరిగింది. వైద్య బృందం ఇంటి వద్దకు వచ్చినప్పుడు ప్రతి ఒక్కరూ వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టరుగా టీఎం బాబు



గుడుపల్లె :మండల టీడీపీ అధ్యక్షుడు టీఎం బాబును రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టరుగా ప్రభుత్వం నియమించింది. గతంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్‌గా, తెలుగు యువత విభాగంలో మెంబరుగా బాబు పనిచేశారు.

మత్తు పదార్థాలతో జీవితం విధ్వంసం

కుప్పం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలు తీసుకోవడం వల్ల జీవితం విధ్వంసమవుతుందని కుప్పం సీఐ మల్లేశ్ యాదవ్ అన్నారు. కుప్పంలోని డాక్టర్ జేమ్సియెన్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం యాంటీ ర్యాగింగ్, యాంటీ పోర్న్, యాంగీ నార్కోటిక్స్ చట్టాలపై ప్రత్యేకంగా సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సీఐ మాట్లాడుతూ గంజాయి, ఇతర మత్తు పదార్థాల సేవనం ఆరోగ్యాన్ని దెబ్బతీయడమే కాక, సమాజంలో మనుషులను కిందికి దిగజారుస్తుందన్నారు. ముఖ్యంగా విద్యార్థులు వీటికి అలవాటు పడితే వారి భవిష్యత్తు ఘోరంగా దెబ్బతింటుందన్నారు. వ్యసనాలకు దూరంగా ఉండాలని హితవు పలికారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సయ్యద్ హుస్సేన్ మియ్యా, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

పలమనేరు, నవంబరు14 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం సీపీఎం నాయకులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు గిరిధరగుప్తా మాట్లాడుతూ విద్యుత్ ట్రూఅప్ ఛార్జీలు రద్దు చేయాలని, నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలని, ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు భర్తీచేయాలని, నిరుద్యోగ భృతి ఇవ్వాలని, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ మానుకోవాలని, ఉద్యోగుల తొలగింపు విరమించాలని, మహిళలు, దళితులు, మైనారిటీలపై దాడులు అరికట్టాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రాజా, జయంతి, హరి, ధనమ్మ, రత్నమ్మ, ఖైరున్నీసా, శాంతమ్మ, కేవీపీఎస్ మండల కార్యదర్శి రమేష్, లక్ష్మయ్య పాల్గొన్నారు.

30 మంది ఉద్యోగాలకు ఎంపిక

పలమనేరు, నవంబరు14 (ఆంధ్రజ్యోతి) :పలమనేరు ప్రభుత్వ డిగ్రీకళాశాలలో గురువారం నిర్వహించిన జాబ్ మేళాలో 30 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేసులు తెలిపారు. వీరంతా శ్రీజ డెయిరీ ప్రైవేట్ లిమిటెడ్‌కు ఎంపికయ్యారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను వైస్ ప్రిన్సిపాల్ జి.ఎం. షణ్ముగం, కోఆర్డినేటర్ డాక్టర్ పి.రవీంద్రారెడ్డి, ఇన్‌చార్జి పి. దిలీప్‌కుమర్, శ్రీజ డెయిరీ మేనేజర్ రవికుమార్ అభినందించారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్పస్వాముల పూజలు



సోమల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): సోమల మండలంలో పలు చోట్ల అయ్యప్ప స్వాముల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. పెద్దఉప్పరపల్లె నీలిమలై కొండలో కొలువుదీరిన అయ్యప్ప స్వామి ఆలయంలో కన్యస్వాములు కొబ్బరి మొక్కలతో అంబలాన్ని ఏర్పాటు చేసి విద్యుత్ దీపాలంకరణ చేశారు. అఖండ జ్యోతులు వెలిగించి అయ్యప్ప స్వామి, వినాయకస్వామి, మణికంఠ స్వామి చిత్రపటాలను ఏర్పాటు చేసి పూజలు జరిపారు. సోమల స్వయంభేశ్వరస్వామి ఆలయంలో అయ్యప్పస్వాములు ఇరుముడు పూజలు నిర్వహించారు. ఇరుముడులతో పురవీధుల్లో ఊరేగారు. అనంతరం ప్రత్యేక బస్సులో శబరిమలై యాత్రకు బయలు దేరారు.

టీడీపీ సభ్యత్వంతో బీమా : గౌనివారి



కేపీ మిట్టలో టీడీపీ నేతలతో గౌనివారి శ్రీనివాసులు

శాంతిపురం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ సభ్యత్వం తీసుకుని బీమా సౌకర్యం పొందాలని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, మండల టీడీపీ అధ్యక్షుడు భాష్యం విశ్వనాథ నాయుడు, మాజీ అధ్యక్షుడు విజయ రామిరెడ్డి, మాజీ ఎంపీపీ ఉదయ కుమార్ నాయుడు అన్నారు. గురువారం మఠం, కొలమడుగు, దండికుప్పం, శివరామపురంలలో సభ్యత్వ నమోదును పరిశీలించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు నాగరాజు, రమేష్, మునిరెడ్డి, మునెప్ప, తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎం నఖీవుల్లా ఖాన్‌కు సన్మానం



పుంగనూరు, నవంబరు14(ఆంధ్రజ్యోతి):లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు అందుకున్న హెచ్‌ఎం నఖీవుల్లాఖాన్‌ను టీడీపీ నాయకులు సుహేల్‌బాషా. పోలీసుగిరి, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. గురువారం స్థానిక ఉర్దూపాఠశాల ఆవరణలో జరిగిన బాలల దినోత్సవం సందర్భంగా ఆయనను సన్మానించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వృద్ధురాలిపై మహిళల దాడి

పుంగనూరు రూరల్, నవంబరు14(ఆంధ్రజ్యోతి): ఓ వృద్ధురాలిపై ముగ్గురు మహిళలు దాడి చేసి గాయపరిచారు. గురువారం పట్టణంలోని మేలుపట్లకు చెందిన పార్వతమ్మ(80) తన ఇంటి ముందు పక్క ఇళ్ల వాళ్లు ఇసుక, మట్టి, చెత్త వేస్తున్నారని కేకలు వేయడంతో పక్కింటి వారైన వాహబ్, షాహినా, నూర్జహాన్, ఉమలు వచ్చి ఆమెపై దాడి చేసి గాయపరిచారు. విషయాన్ని 108 వాహన సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి వృద్ధురాలిని పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్సలు అందించారు.

108 సిబ్బంది సమ్మె నోటీసు

చౌడేపల్లె,నవంబర్14(ఆంధ్రజ్యోతి): 108 అంబు లెన్స్ సిబ్బంది తమ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 25 నుంచి సమ్మె చేయనున్నట్లు తహసీల్దార్ హనుమంతుకు వినతి పత్రం అందించారు. గురువారం వారు మాట్లాడుతూ 108ను ప్రభుత్వమే నేరుగా నిర్వహించాలని, వేతన స్లాబ్ పెంచాలన్నారు, కార్యక్రమంలో 108 సిబ్బంది గణేష్, ప్రసాద్, నవీన్, ఈశ్వరయ్య, సైయ్యద్ పాల్గొన్నారు.

రామకుప్పం : తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ 108 సిబ్బంది గురువారం తహసీల్దారు బాబు, ఎంపీడీఓ లక్ష్మీకాంత్‌లకు సమ్మె నోటీసులు అందజేశారు. 108 చిత్తూరు జిల్లా యూనియన్ ప్రధానకార్యదర్శి లక్ష్మీనారాయణ, లక్ష్మ నాయక్, సురేష్‌లు పాల్గొన్నారు.

ఆవులపల్లె సీతమ్మ చెరువును సందర్శించిన జేసీ

● నిషేధిత జాబితా నుంచి మా భూములను తొలగించి చెరువును పునరుద్ధరించాలని రైతుల వేడుకోలు



రైతులతో మాట్లాడుతున్న జేసీ విద్యాధరి

సోమల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం ఆవులపల్లె సీతమ్మ చెరువును జేసీ విద్యాధరి రైతులతో కలసి గురువారం పరిశీలించారు. ప్రాజెక్టు ముంపు భూములను, రిజర్వాయర్ నిర్మాణం కోసం తెంచి వేసిన సీతమ్మ చెరువు కట్టను సందర్శించారు. ఈక్రమంలోనే రైతులు ఆమెతో మాట్లాడుతూ తమ అనుభవంలోని 911 ఎకరాలను భూములను నిషేధిత జాబితాలో చేర్చి వన్‌బీలు రాకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. బ్యాంకుల నుంచి రుణాలు పొందలేక పోతున్నామని వాపోయారు. పూర్వీకుల నుంచి అనుభవంలోని మా భూములను, మామిడిచెట్లను ప్రభుత్వ ఆస్తులుగా మార్చారని ఆవేదన వ్యక్తం చేశారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనూ రికార్డులు మార్పు చేశారని జేసీ దృష్టికి తెచ్చారు. వందల ఎకరాల్లోని మామిడి తోటల్లో ఫలసాయం పొందలేకపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులపై అక్రమకేసులు పెట్టి జైలుకు పంపారన్నారు. రైతుల న్యాయమైన కోర్కెలు తీర్చాలని వేడుకున్నారు. సీతమ్మ చెరువు కట్టను పునరుద్ధరణ చేసి సాగు నీటి, తాగునీటి సమస్యలు పరిష్కరించాలని కోరారు. అలాగే పెద్దఉప్పరపల్లె - చౌడేపల్లె మార్గంలో పలు చోట్ల వంకలు ప్రవహించడంతో రాకపోకలు ఇబ్బందిగా మారిందని, శాశ్వత కల్వర్టుల నిర్మాణం చేపట్టాలని వినతులు అందజేశారు. రిజర్వాయర్ నిర్మాణం కోసం నష్టపోయిన భూములకు నష్టపరిహారం మంజూరు చేయాలని వినతి చేశారు. ఆమె వెంట తహసీల్దార్ బెన్నురాజ్, మాజీ వైస్ ఎంపీపీ ఉమాపతి నాయుడు, రైతు నాయకులు వేణుగోపాల్ నాయుడు, లక్ష్మీపతి నాయుడు, జాఫర్‌సాహెబ్, జానీబాషా, అబ్దుల్ అజీజ్, వీఆర్‌వో పురుషోత్తం, సర్వేయర్లు పాల్గొన్నారు.

పెద్దలతోపాటు బాలలకూ సమాన హక్కులు



న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న న్యాయవాది భాస్కర్

పలమనేరు, నవంబరు14 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగం పెద్దలందరికీ ఏవిధమైన హక్కులు కల్పించిందో అదే హక్కులను బాలలకూ కల్పించిందని న్యాయవాది ఎల్.భాస్కర్ పేర్కొన్నారు. గురువారం బాలల దినోత్సవం సందర్భంగా పలమనేరు బాలికోన్నత పాఠశాలలో న్యాయ విజ్ఞానసదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి 1989లో బాలల హక్కుల ఒడంబడిక ద్వారా ప్రపంచంలోని బాలలందరికీ హక్కులు అందించారన్నారు. మన దేశం వాటిని 1992లో ఆమోదించి ఒడంబడిక మీద సంతకం చేసిందన్నారు. సదరు ఒడంబడిక ప్రకారం 18ఏళ్లలోపు ఉన్న వారందరూ బాలలే అన్నారు. సమావేశంలో న్యాయవాదులు అరీఫుల్లాఖాన్, సయ్యద్ మొహిద్దీన్, బాలికోన్నత పాఠశాల ప్రిన్సిపాల్ లత, తదితరులు పాల్గొన్నారు. అలాగే పలమనేరు ప్రభుత్వ ఆస్పత్రిలో గురువారం బాలల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ మమతారాణి కేక్ కట్‌చేసి పిల్లలందరికీ పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఎంఓ శారద, వైద్యులు యుగంధర్, ఆసుపత్రి నర్సులు, చిన్నపిల్లలు తదితరులు పాల్గొన్నారు.

సోమల : సోమల జూనియర్ కళాశాలలో జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గంగాధరం నాయుడు, గౌతం, శివయ్య, వెంకటరమణ, రవీంద్రారెడ్డి పాల్గొన్నారు.

కల్లూరు : పులిచెర్ల మండలం కల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం బాలల దినోత్సవం నిర్వహించారు. ముందుగా హెచ్‌ఎం శ్రీవాణి, ఉపాధ్యాయులు మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించి దేశానికి ఆయన అందించిన సేవలను కొనియాడారు. బాల్యం ఎంతో విలువైందని, విలువలతో కూడిన విద్య అవసరమన్నారు.

పుస్తకం.. విజ్ఞాన భాండాగారం





పిల్లలకు బహుమతులు ఇస్తున్న కడా పీడీ, పుంగనూరు గ్రంథాలయంలో విశ్రాంత ఉపాధ్యాయులు

కుప్పం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పుస్తకం విజ్ఞాన భాండాగారమని కడా పీడీ వికాస్ మర్మత్, టీడీపీ నియోజకవర్గ విస్తరణ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు, మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలను గురువారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిల్లలు మంచి మంచి పుస్తకాలు చదవి, జ్ఞానాన్ని, సంస్కారాన్ని, వ్యక్తిత్వాన్ని పెంచుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం పిల్లలకు 'భగవంతుడు ఒక్కడే నిజమైన స్నేహితుడు' అనే అంశంపై వ్యాసరచన పోటీ నిర్వహించి, విజేతలకు బహుమతులు పంచిపెట్టారు. అలాగే ఎంఎఫ్‌సీ ప్రభుత్వ కళాశాల విద్యార్థులకు కథ రాయడం, చిత్రలేఖనం, బీసీ బాలికల వసతి గృహ విద్యార్థులకు చిత్రలేఖనం అంశాలలో పోటీలు నిర్వహించి బహుమతులు పంచిపెట్టారు. గ్రంథాలయాధికారి సత్యవాణి పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వెంకటేష్, లయన్స్ క్లబ్ ప్రతినిధులు మహేశ్, సెల్వం, టీడీపీ నాయకులు గోపీనాథ్, సత్యేంద్రశేఖర్, బాలూ, ప్రభాకర్ విద్యార్థినీ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పుంగనూరు : విద్యార్థులు పుస్తక పఠనం చేస్తేనే ఉన్నత స్థానాలకు వెళ్లగలరని విశ్రాంత ఉపాధ్యాయులు వెంకటపతి, రెడ్డెప్పరెడ్డియాదవ్‌లు పేర్కొన్నారు. గురువారం స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా వారు మాట్లాడుతూ పుస్తకాలు చదవడం వల్ల మంచి విజ్ఞానం, తెలివితేటలు వస్తాయన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి తులసినాయక్, న్యాయవాదులు శైలేంద్ర, గిరిధర్, పగడాల రమణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చౌడేపల్లె : గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు అని ఎంఈవో కేశవరెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రతి విద్యార్థి గ్రంథాలయాలకు వచ్చి పుస్తక పఠనం చేయటం వలన వారికి జ్ఞానం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు సోమశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రకృతి సేద్యంలో శాంతిపురం ఆదర్శంగా నిలవాలి



బొప్పాయి పంటను పరిశీలిస్తున్న ఏడీఏ

శాంతిపురం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి సేద్యంలో శాంతిపురం మండలం ఆదర్శంగా నిలవాలని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ లక్ష్మీప్రసన్న అన్నారు. గురువారం కనమలదొడ్డి, మొరసనపల్లె, కడపల్లె గ్రామాల్లో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయా గ్రామాల్లో రైతులు ప్రకృతి సేద్యం ద్వారా సాగు చేసిన బొప్పాయి. వరి, అరటి పంటలను పరిశీలించారు. పంట నాణ్యత బాగుండడంతో రైతులు వాడిన ఎరువుల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ త్వరలోనే ఎన్‌పీఎం షాప్స్ అందుబాటులోకి వస్తాయన్నారు. సేంద్రియ ఎరువులు వాడకం వల్ల నాణ్యమైన అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో ఏవో అప్సోజి, నవీన్, గోవర్దన్, చంద్ర పాల్గొన్నారు.

క్రీడాకారులకు ప్రశంసా పత్రాల పంపిణీ

చౌడేపల్లె, నవంబర్ 14 (ఆంధ్రజ్యోతి):రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొన్న క్రీడాకారులకు బాలల దినోత్సవం సందర్భంగా ఎంఈవో కేశవరెడ్డి ప్రశంసా పత్రాలు అందించారు. గురువారం స్థానిక హైస్కూల్‌లో రాష్ట్రస్థాయి కబడ్డీ, వాలీబాల్ పోటీలలో పాల్గొన్న నిరంజన్, శివకేశవ, హేమావతి, సుమతి, లాస్య, ప్రియ, నిహారిక, అపర్ణలకు మెడల్స్ బహూకరించి, ప్రశంసా పత్రాలు అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నాగరాజరెడ్డి, పీఈటీ రాజేంద్ర, ఉపాధ్యాయుడు మురళి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలి మెడలో చైన్ అపహరణ

పుంగనూరు రూరల్, నవంబరు14 (ఆంధ్రజ్యోతి) : ఓ వృద్ధురాలి కళ్లల్లో కారం కొట్టి బంగారు చైన్, కమ్మలను గుర్తుతెలియని మహిళలు లాక్కెళ్లిన ఘటన గురువారం సాయంత్రం పుంగనూరు సమీపంలో జరిగింది. పట్టణంలోని తాటిమాకులపాళ్యంకు చెందిన పార్వతమ్మ(75) పుంగమ్మ చెరువు మొరవ వద్ద గల సింగిరిగుంట సమీపంలోని పొలం వద్ద పనులు చేసుకుంటుండగా వెనక వైపునే ముసుగు ధరించిన మహిళలు వచ్చి కళ్లలో కారం కొట్టి మెడలో ఉన్న చైన్, చెవులల్లో ఉన్న కమ్మలు లాక్కెళ్లినట్లు ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు.

గుడుపల్లె ఏవోగా బాలకృష్ణ



గుడుపల్లె, నవంబరు14(ఆంధ్రజ్యోతి): గుడుపల్లె మండల పరిషత్ పరిపాలనాధికారి(ఏవో)గా కేటీ బాలకృష్ణ గురువారం బాధ్యతలు స్వీకరించారు. కుప్పం మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా ఉన్న బాలకృష్ణ పరిపాలనాధికారిగా పదోన్నతి పొంది గుడుపల్లెలో నియమితులయ్యారు.

హక్కులపై అవగాహన పెంచుకోవాలి



నెహ్రూ చిత్రపటానికి నివాళి

పుంగనూరు , నవంబరు14(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు తమ హక్కులపై అవగాహన కలిగివుండాలని రాయలసీమ చిల్డ్రన్స్ అకాడమి పాఠశాల డైరెక్టర్ చంద్రమోహన్‌రెడ్డి కోరారు. గురువారం ఆ పాఠశాల ఆవరణలో జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే మండలంలోని గూడూరుపల్లె ప్రభుత్వ పాఠశాలలో జరిగిన సమావేశంలో హెచ్‌ఎం మహేశ్‌నారాయణ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకోవాలన్నారు.

బేస్‌బాల్ పోటీల్లో కస్తూర్బా విద్యార్థినుల ప్రతిభ



బైరెడ్డిపల్లె, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ పోటీల్లో కమ్మనపల్లె కస్తూర్బా పాఠశాల విద్యార్థినులు ఇందు, ప్రవల్లిక పాల్గొని ప్రతిభ కనబరిచినట్లు ఎస్వో స్వరూప, పీడీ అక్తర్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులను ఉపాధ్యాయులు అభినందించారు.

దళితవాడలకు శ్మశాన స్థలాలు కేటాయించండి

గంగవరం, నవంబరు 14,(ఆంధ్రజ్యోతి): మండలంలో దళితవాడలకు శ్మశాన స్థలం కేటాయించాలని సీపీఎం నాయకులు గురువారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ నెల 8వ తేదీ నుంచి 13వ తేదీ వరకు మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించామన్నారు. చాలా గ్రామాల్లో మురుగు కాలువలు, తాగునీరు, రోడ్ల సమస్యలపై ప్రజలు సీపీఎం బృందానికి మొరపెట్టుకున్నారన్నారు. రేషన్ కార్డులు, పెన్షన్లు, ఇళ్లస్థలాలు, భూముల రీసర్వేలో సమస్యలు కూడా అధికంగా ఉన్నాయన్నారు. అధికారులు స్పందించి గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించడంతోపాటు సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఓబులరాజు, ఈశ్వర్, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

పొలం వివాదంలో దాడి



చౌడేపల్లె/పుంగనూరు రూరల్, నవంబరు14 (ఆంధ్రజ్యోతి): చౌడేపల్లె మండలంలో పొలం వివాదం ఒకరిపై దాడికి దారి తీసింది. బాధితుడి కథనం మేరకు .. చౌడేపల్లె మండలం చారాలకు చెందిన ఉత్తరాది హరిప్రసాద్‌కు, పెద్దపంజాణి మండలం బట్టందొడ్డికి చెందిన బెల్లం వెంకట్రామయ్య మధ్య భూ తగాదాలున్నాయి. గురువారం ఉదయం చారాల సమీపంలో హరిప్రసాద్ రోడ్డుపై నడుస్తూ వస్తుండగా బెల్లం వెంకట్రామయ్య, నెర్నిపల్లెకు చెందిన శివతోపాటు మరో వ్యక్తి కత్తితో దాడి చేసి గాయపర్చారు. తాను కేకలు వేయడంతో వారు పరారీ అయినట్లు హరిప్రసాద్ తెలిపారు. గాయపడిన హరిప్రసాద్‌ను కుటుంబసభ్యులు 108 వాహనంలో పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్సలు అందించారు.

ఆర్టీసీ సేవలపై నేడు సదస్సు

కుప్పం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కుప్పం ఆర్టీసీ డిపో ఎదుట శుక్రవారం ఉదయం ప్రజారవాణా సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీఎస్.మునిరత్నం తెలిపారు. ఆర్టీసీ సంస్థ ప్రజలకు అందిస్తున్న సేవలను ఈ సదస్సులో వివరిస్తామన్నారు. అలాగే ఆర్టీసీ బస్సులు, రూట్‌లు, ఆలస్యం, బస్సులు కావాల్సిన గ్రామాలు తదితర సమస్యలపై ప్రజలు స్వేచ్ఛగా తమ అభిప్రాయాలు వెల్లడించవచ్చన్నారు. ఆయా సమస్యలపై వినతులు స్వీకరించి పరిష్కారాలు చూపుతామని తెలిపారు.

వలస కార్మికులకు రేషన్‌కార్డుల పంపిణీ

కుప్పం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కుప్పంతోపాటు మండల పరిధిలో నివసిస్తున్న వలస కార్మికులకు రేషన్ కార్డులు మంజూరు చేసి పంపిణీ చేస్తున్నట్లు తహసీల్దారు చిట్టిబాబు తెలిపారు. కుప్పం పురపాలక సంఘం పరిధిలోని వలస కార్మికులకు ఆయన గురువారం తన కార్యాలయంలో రేషన్‌కార్డులు పంపిణీ చేశారు. మున్సిపాలిటీ పరిధిలో ఇప్పటికి 13 మంది వలస కార్మికులను గుర్తించామన్నారు. ఇంకా వలస కార్మికులు ఎవరైనా ఉంటే దరఖాస్తు చేసుకుంటే రేషన్‌కార్డులు మంజూరు చేస్తామని చెప్పారు. వీఆర్వో రవినాయక్ పాల్గొన్నారు.

'డయల్ యువర్ డీఎం'లో 8 ఫిర్యాదులు

పలమనేరు, నవంబరు14 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు ఆర్టీసీ డిపో కార్యాలయంలో గురువారం ఉదయం 11 గంటలకు నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమంలో 8 మంది ఆర్టీసీ సమస్యలపై ఫిర్యాదు చేశారని, సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్తున్నామని డిపో మేనేజర్ టీకే స్వామి తెలిపారు. శ్రీశైలంకు బస్సు సర్వీసులు నడపాలని, తిరుపతికి ఉదయం 4 గంటలకు సర్వీసు నడపాలని, చిత్తూరు నుంచి పలమనేరుకు రాత్రి 9 గంటలకు పల్లెవెలుగు బస్సు నడపాలని, దాసార్లపల్లినుంచి పలమనేరుకు బస్సులు నడపాలని వారు కోరినట్లు డిపో మేనేజర్ తెలిపారు.

కల్యాణ మండపానికి విరాళాలు

సోమల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): సోమల స్వయంభేశ్వరస్వామి ఆలయానికి అనుబంధంగా శివపార్వతుల కల్యాణ మండపం నిర్మాణ పనులకు గురువారం పలువురు దాతలు విరాళాలను ధర్మకర్త బీవీ సోమశేఖర్‌కు అందజేశారు. సూరయ్యగారిపల్లెకు చెందిన ఉపాధ్యాయుడు బండ్ల శ్రీనివాసులు రూ. 10,116, కుర్రా చిన్నపాపమ్మ రూ.5016, వరదం సావిత్రమ్మ వెంకటరమణ రూ.5,116 విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో లింగయ్య, జగన్‌మోహన్, శంకర్‌రెడ్డి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి వితరణ

రొంపిచెర్ల,నవంబరు14(ఆంధ్రజ్యోతి): బొమ్మయ్యగారిపల్లె పంచాయతీ నగిరి దళితవాడలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పూర్వ విద్యారులు విద్యాసామగ్రి వితరణగా ఇచ్చారు. పూర్వవిద్యార్థులు రెడ్డిప్రసన్న, హరిత, జగదీష్, సిద్ధార్థజ్యోతిలు పిల్లలకు నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్స్, స్టీల్‌బాక్స్‌లు, స్కేలు, మెండర్లు వంటివి పంపిణీ చేశారు. ఎంఈవో శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

కల్లూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో బెంగుళూరు వైదేహి ఆసుపత్రి ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 2:30 వరకు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సమన్వయకర్త లోకేష్ రాయల్ తెలిపారు. క్యాన్సర్, గుండె, కిడ్నీ, న్యూరాలజీ తదితర వ్యాధులకు పరీక్షలు నిర్వహిస్తారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేటినుంచి నిత్యాన్నదానం

సదుం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ఎర్రాతివారిపల్లె కోటమలైపై వెలసిన అయ్యప్పస్వామి ఆలయంలో శుక్రవారం నుంచి వచ్చే ఏడాది జనవరి 14వ తేదీ వరకు నిత్యాన్నదానం నిర్వహించనున్నట్లు అలయ మేనేజర్ భాస్కరరాజు తెలిపారు. ఆలయ ధర్మకర్త, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఏటా నవంబరు నుంచి జనవరి 14 వరకు నిత్యాన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఆర్టీసీ ప్రయాణికులకు ప్రోత్సాహక బహుమతులు

పుంగనూరు రూరల్, నవంబరు14(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ప్రయాణికులకు లక్కీ డిప్ ద్వారా ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్నట్లు డిపో మేనేజర్ సుధాకరయ్య తెలిపారు. గురువారం ఆర్టీసీ డిపో ఆవరణలో పుంగనూరు నుంచి మేటిమంద, కలికిరి, రాయచోటి, ముళబాగళ్ మార్గాల్లో ఆర్టీసీ బస్సులలో ప్రయాణించి లక్కీడిప్ ద్వారా ఎంపికైన అరుణకుమారి, దొరబాబు, విశ్వనాథ్, మునికుమారిలకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఆర్టీసీ అధికారులు సంధ్య, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

సచివాలయాల తనిఖీ

పుంగనూరు, నవంబరు14(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సరిఫికెట్ల కోసం ఇబ్బందులు పడకుండా తగు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ ఛైర్మన్ అలీంబాషా సూచించారు. గురువారం పట్టణ పరిధిలోని పలు సచివాలయాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమైన సరిఫికెట్లను సకాలంలో అందించాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు సచివాలయాలకు వచ్చిన సమయంలో వారితో మర్యాదగా నడుచుకోవాలని, వారితో దురుసుగా ప్రవర్తించినట్లు ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆర్థిక లావాదేవీలతో ఘర్షణ

- ఒకరిపై ముగ్గురి దాడి

పుంగనూరు రూరల్, నవంబరు14(ఆంధ్రజ్యోతి): పుంగనూరు మండలం గూడూరుపల్లెలో ఆర్థిక లావాదేవీలతో ఓ వ్యక్తిని ముగ్గురు చితకబాదిన ఘటన గురువారం వెలుగు చూసింది. గూడూరుపల్లెకు చెందిన గంగాధర్ కుమారుడు నాగరాజు... అదే గ్రామానికి చెందిన బాలసుబ్రహ్మణ్యం, కొండసముద్రానికి చెందిన శశికుమార్, పుంగనూరుకు చెందిన మల్లికార్జునల మధ్య ఆర్థిక లావాదేవీలున్నాయి. గురువారం నలుగురి మధ్య గొడవలు జరిగాయి. ఈ ఘర్షణలో నాగరాజును బాలసుబ్రహ్మణ్యం, మల్లికార్జున. శశికుమార్‌లు దాడి చేసి గాయపరిచారు. గాయపడిన నాగరాజును కుటుంబసభ్యులు పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్సలు అందించారు.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

'కరియమాణిక్య స్వామి' పవిత్రోత్సవాలకు అంకురార్పణ



నగరి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): నగరి మున్సిపాలిటీ పరిధిలోని కరియమాణిక్యస్వామి ఆలయంలో గురువారం నుంచి పవిత్రోత్సవాలు ప్రారంభించారు. ఉదయం విశేష పూజలు, సాయంత్రం 7.30 గంటలకు సేనాధిపతి ఉత్సవం, అంకురార్పణ కార్యక్రమాలు జరిగాయి. యాగశాల వేదికగా పవిత్రహోమం నిర్వహించారు. ఈ కార్యక్రమాలను ఏఈవో రవి, సూపరెండెంట్ సోమశేఖర్, ఆలయ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ పర్యవేక్షించారు.

లోకేశ్‌ను కలిసిన టీడీపీ నేతలు



పాలసముద్రం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను టీడీపీ కార్యనిర్వాహక రాష్ట్ర కార్యదర్శి భీమనేని చిట్టిబాబు నాయుడు, గంగాధరనెల్లూరు ఎమ్మెల్యే థామస్ మర్యాదపూర్వకంగా కలిశారు. గంగాధరనెల్లూరు నియోజకవర్గం అభివృద్ధి పనులకోసం నిధులు విరివిగా ఇప్పించాలని మంత్రికి విన్నవించారు.

వ్యాపారులు సకాలంలో పన్నులు చెల్లించాలి

చిత్తూరు రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): వ్యాపారులు సకాలంలో పన్నులు చెల్లించాలని వాణిజ్యపన్నుల శాఖ జేసీ జాన్ స్టీవెన్‌సన్ తెలిపారు. గురువారం స్థానిక కట్టమంచిలోని వాణిజ్యపన్నుల శాఖ కార్యాలయంలో చిత్తూరు, పలమనేరు గ్రానైట్ వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. కొత్త సవరణల ప్రకారం పన్నులు కట్టాలని చెప్పారు. రూ.50వేల వరకు రవాణా చేసేటప్పుడు కచ్చింతంగా వేబిల్లు పెట్టుకోవాలన్నారు. సహాయ కమిషనర్లు వరలక్ష్మి, ఏవీ శ్రీనివాసరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థికసాయం



ఐరాల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): తిరుమలయ్యగారిపల్లె ఎస్సీ కాలనీలో గత వారం మృతి చెందిన శివలింగయ్య కుటుంబానికి మేదరమెట్ల శంకర్‌నాయుడు, పార్వతమ్మ చారిటబుల్ ట్రస్టు ద్వారా గురువారం రూ.పదివేల ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ కాలనీలో ఎవరు మృతి చెందినా ట్రస్టు నిర్వాహకుడు మేదరమెట్ల మోహన్‌నాయుడు ఆర్థిక సాయం చేయడం ఆనవాయితీ. ఏడాదిగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వినాయక, టీడీపీ నాయకులు రాజశేఖర్‌నాయుడు, దేవరాజులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

చుడా చైర్‌పర్సన్‌కు సత్కారం


హేమలతను సన్మానించిన ఎల్బీఐ లోకేష్ రెడ్డి

యాదమరి/పూతలపట్టు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): చుడా చైర్‌పర్సన్ కటారి హేమలతను గురువారం పలువురు నాయకులు సత్కరించారు. వీరిలో.. తెలుగు యువత అధికార జిల్లా ప్రతినిధి వల్లేరు అమరనాథ నాయుడు, పూతలపట్టు మండలానికి చెందిన టీడీపీ యువనేత ఎల్బీఐ లోకేష్ రెడ్డి, నాయకులు కృష్ణమూర్తి, కంద, రెడ్డెప్ప రెడ్డి, దయ ఉన్నారు.

డిప్యూటీ స్పీకర్‌కు అభినందన



నగరి/వెదురుకుప్పం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజును గురువారం నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అభినందించారు. అలాగే అమరావతిలో డిప్యూటీ స్పీకర్‌ను వెదురుకుప్పం మండలం నల్లవెంగనపల్లెకు చెందిన టీఎన్‌టీయూసీ జీడీనెల్లూరు అధ్యక్షుడు గాలి బాబునాయుడు కలసి అభినందనలు తెలిపారు.

ఎమ్మెల్యే థామస్‌కు విప్ పదవి రావడంపై హర్షం


సంతబైలులో స్వీట్లు తినిపించుకుంటున్న టీడీపీ నేతలు

గంగాధరనెల్లూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరు ఎమ్మెల్యే థామస్‌కు విప్ పదవి రావడంపై టీడీపీ నేతలు హర్షం వ్యక్తం చేశారు. గురువారం గంగాధరనెల్లూరు అంబేద్కర్ విగ్రహం వద్ద సంబరాలు జరుపుకున్నారు. టీడీపీ నాయకులు వెంకటేష్, శ్రీధర్‌యాదవ్, స్వామిదాస్, దేవసుందరం, రాంబాబురెడ్డి, జీవరత్నం,తదితరులు పాల్గొన్నారు.

వెదురుకుప్పం: మండలం సంతబైలులో గురువారం రాత్రి జరిగిన సంబరాల్లో టీఎన్ఎస్ఎఫ్ వెదురుకుప్పం మండలాధ్యక్షుడు బండి డిల్లీప్రసాద్‌రెడ్డి, మండల యువనేత పేట చూడామణిరెడ్డి, నాయకులు బండి పరమేశ్వర రెడ్డి, మునిరత్నంరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, కృష్ణారెడ్డి, రామకుమారి తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం


ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

చిత్తూరు రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను గురువారం చిత్తూరులో ఆర్డీవో శ్రీనివాసులు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. వారోత్సవాల్లో నిర్వహించే పోటీల్లో విజేతలకిచ్చే బహుమతుల కోసం మాజీ కౌన్సిలర్ పార్థసారథినాయుడు రూ.10వేలను అందజేశారు. బాలల గ్రంథాలయ అధికారి లలిత, విద్యార్థులు పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: మండల కేంద్రంలోని గ్రంథాలయంలో విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, ఆటల పోటీలు నిర్వహించారు. ఎంఈవోలు నాగేశ్వర్‌రావు, రమేష్ బాబుగ్రంథాలయ అధికారి శ్రీకాంత్‌రెడ్డి, టీచర్లు పాల్గొన్నారు.

మూడో అంతస్తు నుంచి పడి భవన నిర్మాణ కూలీ మృతి

తిరుపతి (నేరవిభాగం,) నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మూడో అంతస్తు నుంచి పడి ఓ భవన నిర్మాణ కూలీ మృతిచెందాడు. తిరుపతి రూరల్ ఎస్‌ఐ రామకృష్ణ తెలిపిన వివరాల మేరకు.. ఎస్‌ఆర్‌పురానికి చెందిన బాబయ్య (మేస్త్రీ) గురువారం తిరుపతి రూరల్ మండలం లింగేశ్వర్‌నగర్‌లో ఓభవనానికి ప్లాస్టింగ్ పనులు చేస్తూ ప్రమాదవశాత్తూ కిందపడ్డాడు. తలకు తీవ్ర గాయం కావడంతో మృతిచెందాడు. సోదరుడు చిరంజీవి ఫిర్యాదుతో కేసు నమోదైంది.

చిన్నారి పెద్ద మనసు



దర్శితశ్రీ

గంగాధరనెల్లూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కలిజవేడు పంచాయతీ కె.వెంకటాపురం గ్రామానికి చెందిన డిల్లీనాయుడు కుమార్తె దర్శితశ్రీ ఎనిమిదో తరగతి చదువుతోంది. విజయవాడ వరద బాధితుల సహాయార్థం గ్రామంలో తిరిగి రూ.12,860 విరాళాలను సేకరించింది. ఈ మొత్తాన్ని బాధితులకు పంపాలని తాను చదువుతున్న ఎట్టేరి శ్రీభానోదయ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ యజామాన్యానికి అందజేసింది. దీంతో గురువారం చిన్నారిని కరస్పాండెంట్ మద్దిపట్ల నాగేశ్వరరావు, హెడ్‌మాస్టర్ లావణ్య సన్మానించారు. అలాగే దర్శితశ్రీని చిన్నప్పటి నుంచి పెంచుతున్న అత్తతోపాటు తండ్రిని కూడా అభినందించారు.



గురువారం మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో చిత్తూరు నగరాన్ని కప్పేసిన కారుమబ్బుల దుప్పటిని ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ క్లిక్‌మనిపించారు.

ప్రతిభతోనే విద్యార్థులకు గుర్తింపు


సమావేశంలో ప్రసంగిస్తున్న ట్రైనీ కలెక్టర్ హిమవంశీ

● ఘనంగా బాలల దినోత్సవం

చిత్తూరు సెంట్రల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రతిభతోనే విద్యార్థులకు గుర్తింపు వస్తుందని ట్రైనీ కలెక్టర్ హిమవంశీ అన్నారు. బాలల దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. సంతపేటలోని పీఎన్‌సీ నగరపాలక ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ పాల్గొన్నారు. చీఫ్ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ భానుప్రకాష్‌రెడ్డి ప్రసంగించగా, పలు పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు డీఈవో వరలక్ష్మి బహుమతులు అందజేశారు. స్త్రీశిశు సంక్షేమాధికారి హేమవతి, హెచ్‌ఎం వేదకుమారి, ఎంఈవో-2 మోహన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ● రాంనగర్ కాలనీలోని హార్వర్డ్ స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు కరస్పాండెంట్ భాస్కర్ బహుమతులు ప్రదానం చేశారు. డైరెక్టర్ త్రివేణి, టీచర్లు పాల్గొన్నారు. ● నాగాలమ్మ గుడి వీధిలోని బృందావన్ పాఠశాలలో కరస్పాండెంట్ శైలజాకుమారి, డైరెక్టర్ ప్రియతేజ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో చిన్నారుల వేషధారణలు, నృత్యాలు అలరించాయి. టీచర్లు పాల్గొన్నారు.

నగరి: నగరి మండలం, మున్సిపాలిటీ పరిధిలోని అన్ని పాఠశాలల్లో వేడుకలు నిర్వహించినట్లు ఎంఈవోలు శ్రీదేవి, నమశ్శివాయలు తెలిపారు.

బంగారుపాళ్యం: గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల వసతి గృహంలో జరిగిన కార్యక్రమంలో సీఐ కత్తి శ్రీనివాసులు, ఎంఈవో నాగేశ్వర్‌రావు, ప్రిన్సిపాల్ వెంకటసుబ్బయ్య, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది రమేష్, యుగంధర్ పాల్గొన్నారు.

పూతలపట్టు: గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ మాసలామణి, గ్రంథాలయ అధికారి రవీంద్రబాబు, టీచరు మోహన్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

పాలసముద్రం: పాలసముద్రం హైస్కూల్లో నిర్వహించిన కార్యక్రమంలో ఎంఈవో రాజేంద్ర ప్రసాద్, హెచ్‌ఎంలు, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

పిల్లలే సమాజానికి పునాదులు

చిత్తూరు సిటీ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పిల్లలే సమాజానికి పునాదులని మాజీ మేయర్, చుడా చైర్‌పర్సన్ కటారి హేమలత అన్నారు. గురువారం యూరో కిడ్స్ పాఠశాలలో నిర్వహించిన బాలల దినోత్సవంలో ఆమె ప్రసంగించారు. కరస్పాండెంట్ లత గురుగణేష్, సిబ్బంది పాల్గొన్నారు.




హార్వర్డ్ విద్యార్థినులకు బహుమతుల ప్రదానం - వివిధ రకాల వేషధారణల్లో బృందావన్ చిన్నారులు - 'యూరో కిడ్స్' చిన్నారులతో కటారి హేమలత

నగరవాసుల సమస్యలు పరిష్కరించాలి
ఎంహెచ్‌వోకు సీపీఎం వినతి

చిత్తూరు అర్బన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): నగరవాసుల సమస్యలను పరిష్కరించాలని సీపీఎం నేతలు కోరారు. గురువారం ఎంహెచ్‌వో లోకేశ్‌కు ఈ మేరకు వినతిపత్రాన్ని నగర కార్యదర్శి సురేంద్రన్, తదితరులు ఇచ్చారు. వారంపాటు నగరంలో ప్రజాపోరు కార్యక్రమం ద్వారా పలు కాలనీల్లో పర్యటించామని చెప్పారు. వీధి దీపాలు, డ్రైనేజీలు, తాగునీటి సమస్యలు గుర్తించామన్నారు. ముఖ్యంగా ఓటిచెరువు పల్లపు ప్రాంతంలో ఉండటం వల్ల వర్షాకాలంలో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎంహెచ్‌వో హామీ ఇచ్చినట్లు నేతలు తెలిపారు.

సాగునీటి సంఘం ఎన్నికలపై శిక్షణ


సమావేశంలో ప్రసంగిస్తున్న మురళీకుమార్

నింద్ర, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘం ఎన్నికలపై టీచర్లకు, సచివాలయ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం గురువారం ఎంపీడీవో కార్యాలయంలో జరిగింది. జిల్లా ఇరిగేషన్ ఈఈ మురళీ కుమార్ ఆధ్వర్యంలో ఈ శిక్షణ నిర్వహించారు. తహసీల్దార్ శేషగిరిరావు, ఎంపీడీవో శివప్రసాద్ వర్మ, ఇరిగేషన్ ఏఈ లోకేశ్వరరెడ్డి, ఎంఈవోలు వసుమతిదేవి, శ్రీధర్‌రాజు పాల్గొన్నారు.

విజయపురం: ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఈఈ మురళీకుమార్‌తోపాటు ఎంపీడీవో రమణప్రకాష్, ఇరిగేషన్ ఏఈఈ ప్రశాంత్, ఎంఈవో హరిప్రసాద్‌వర్మ పాల్గొన్నారు.

గంగాధరనెల్లూరు: ఎంపీడీవో మీటింగ్ హాలులో జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈ జయచంద్రబాబునాయుడు, ఏఈ భాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల సమస్యలు పరిష్కరించాలి: సీపీఎం

బంగారుపాళ్యం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలో గిరిజనుల సమస్యలు పరిష్కరించాలని సీపీఎం నాయకులు గంగరాజు, మురళి డిమాండ్ చేశారు. అలాగే నిత్యావసరాల ధరలు, కరెంటు చార్జీలు తగ్గించాలంటూ గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం డీటీ కళ్యాణికి వినతి పత్రం అందజేశారు. నాయకులు శంకరాచ్చారి, హేమంత్, జయరామ్ శెట్టి, మంజు, రైతులు సుబ్రహ్మణ్యం, రాజన్న, మంజునాథ్, గోపి పాల్గొన్నారు.

ఎంపీడీవో కార్యాలయ ఏవోగా కుమార్

గుడిపాల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎంపీడీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కుమార్‌కు ఏవోగా పదోన్నతి కల్పించడంతో ఆయన గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆయన్ను ఎంపీడీవో శివరాజు, టీడీపీ నాయకులు బాలాజి నాయుడు, ఆనంద్ గౌడ్, బోడెబ్బ నాయుడు, సాంబశివనాయుడు అభినందించారు.

27నుంచి ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర మహాసభలు

చిత్తూరు అర్బన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లాలో ఈనెల 27 నుంచి 30వ తేదీ వరకు ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర మహాసభలు జరుగుతాయని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారెడ్డి తెలిపారు. గురువారం సంఘ జిల్లా మహాసభను ఆర్కే డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. మహాసభలకు వేలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. నేతలు బండి చలపతి, నాగరాజు, ప్రవీన్, మున్నా, బాలాజి పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

గుడిపాల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్న క్యాంటీన్‌లో గురువారం జరిగిన పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమానికి కొత్తపల్లెకి చెందిన గురుస్వామి కుమారుడు హరీష్ భోజనం వితరణ చేయగా, టీడీపీ నాయకులు చల్లా, బాబు తదితరులు పాల్గొన్నారు.

రెండు లారీల ఢీ : ఇద్దరికి తీవ్రగాయాలు

గుడిపాల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): 190 రామాపురం సీఎంసీ సమీపంలోని లక్ష్మీపురం వద్ద గురువారం తెల్లవారు జామున రెండు లారీలు ఢీకొన్న సంఘటనలో ఇద్దరు డ్రైవర్లు తీవ్రంగా గాయపడ్డారు. తమిళనాడు రాష్ట్రం వేలూరు నుంచి చిత్తూరు వైపు వస్తున్న లారీని చిత్తూరు నుంచి వేలూరు వైపుగా వెళ్తున్న లారీ ఎదురెదురుగా ఢీకొంది. ఈప్రమాదంలో తమిళనాడుకు చెందిన లారీ డ్రైవర్లు బాలకృష్ణన్, రాజేష్‌కుమార్ తీవ్రంగా గాయపడ్డారు. బాధితులను చికిత్స నిమిత్తం 108 వాహనంలో చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

1,200 లీటర్ల సారా ఊట ధ్వంసం

వెదురుకుప్పం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం కొటార్వేడు గ్రామ పరిసర ప్రాంతాల్లో సారా స్థావరాలపై పోలీసులు గురువారం దాడులు చేశారు. 200 లీటర్ల సారా ఊటను ధ్వంసం చేసి, 15 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాజ్‌కుమార్ తెలిపారు. ● వెదురుకుప్పం మండలం పచ్చికాపల్లం గ్రామ పంచాయతీ నక్కలాంపల్లె గ్రామ పరిసర ప్రాంతాల్లోనూ సారా స్థావరాలపై దాడులు నిర్వహించి, వెయ్యి లీటర్ల సారా ఊట ధ్వంసం చేసి కేసు నమోదు చేశామని ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు.


ఇద్దరు సారా విక్రేత్రల అరెస్టు

పాలసముద్రం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు సారా విక్రేతలను అరెస్టు చేశారు. హెడ్‌కానిస్టేబుల్ సుబ్రమణ్యంనాయుడు తెలిపిన వివరాల మేరకు నరసింహాపురం పంచాయతీ అయ్యవారికండ్రిగలో గురువారం సారా పొట్లాలను విక్రయిస్తున్న పాండురంగన్, రవిలను అరెస్టు చేశారు. పాండురంగన్ వద్ద 62 సారా ప్యాకెట్లు, రవి వద్ద 38 సారా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించారు.

27 మందికి జరిమానా

చిత్తూరు అర్బన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపిన 27 మందికి జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ నిత్యబాబు గురువారం చెప్పారు. బుధవారం జరిగిన తనిఖీల్లో మద్యం తాగి వామనం నడుపుతున్న 27 మందిని గుర్తించి, కేసు నమోదు చేశామన్నారు. వీరిని గురువారం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టులో హాజరుపరచగా నిందితులు ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున జరిమానా విధిస్తూ జడ్జి ఉమాదేవి ఉత్తర్వులిచ్చారని సీఐ పేర్కొన్నారు.

డీఎస్పీ బాధ్యతల స్వీకరణ


విజయశేఖర్

చిత్తూరు అర్బన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు మహిళా పోలీసు స్టేషన్ డీఎస్పీగా విజయశేఖర్ గురువారం బాధ్యతలు తీసుకున్నారు. ఇటీవల ప్రభుత్వం చేపట్టిన సాధారణ బదిలీల్లో భాగంగా హెడ్‌క్వార్టర్స్‌లో విధులు నిర్వహిస్తూ ఇక్కడికొచ్చారు.

వేరుశనగ విత్తనాల పంపిణీ

విజయపురం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబు ప్రభుత్వం అధికారంలో ఉంటేనే రైతులకు సబ్సిడీపై వేరుశనగ విత్తనాలు సకాలంలో అందుతాయని జిల్లా పంచాయతీ రాజ్‌చాంబర్ అధ్యక్షుడు చుక్కా ధనుంజయయాదవ్ అన్నారు. విజయపురంలో వేరుశనగ విత్తనాలను గురువారం ధనుంజయయాదవ్ ద్వారా పంపిణీ చేశారు. పన్నూరు హరిశ్చంద్రాపురంలో టీడీపీ మండల అధ్యక్షుడు రమేష్‌రాజు, నాయకులు కలిసి వేరుశనగ విత్తనాలు పంపిణీ చేశారు. ఏవో రజినీకుమారి పాల్గొన్నారు.

నగరి: ముడిపల్లిలో రైతులకు వేరుశనగ విత్తనాల పంపిణీ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మునిరత్నంనాయుడు, దేవరాజులు, గోవిందస్వామి, వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

వరసిద్ధుడి అన్నదానానికి రూ.లక్ష విరాళం

ఐరాల(కాణిపాకం), నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి తిమ్మసముద్రంకు చెందిన తులసికృష్ణ గురువారం రూ.1,00,116 విరాళంగా అందించారు. దాతను ఈవో గురుప్రసాద్ ఆలయ మర్యాదలతో ఆహ్వానించి, దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

పక్వానికి వచ్చిన మామిడి కాయలనే కోయాలి

● జిల్లా ఉద్యాన అధికారి


సమావేశంలో ప్రసంగిస్తున్న మధుసూదన్‌రెడ్డి, వేదికపై బాలసుబ్రహ్మణ్యం

వెదురుకుప్పం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): పక్వానికి వచ్చిన మామిడి కాయలను మాత్రమే కోయాలని జిల్లా ఉద్యాన అధికారి డి.మధుసూదన్‌రెడ్డి తెలిపారు. గురువారం కార్వేటినగరం మండలం సుద్దగుంట గ్రామంలో రైతులకు అవగాహన సదస్సు జరిగింది. ఆయన మాట్లాడుతూ.. ఆయిల్‌పామ్ పంటసాగును గంగాధరనెల్లూరు, ఎస్‌ఆర్‌పురం, కార్వేటినగరం, విజయపురం, నగరి, నింద్ర మండలాల్లో ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. ఏపీఎంఐపీ పీడీ బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. చిన్న, సన్నకారు రైతులకు 90 శాతం, పెద్ద రైతులకు 70 శాతం రాయితీతో ప్రభుత్వం డ్రిప్ పరికరాలను అందిస్తున్నట్లు, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సంక్షిప్తంగా..

బోధన సామగ్రి వితరణ

శ్రీరంగరాజపురం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): 49.కొత్తపల్లెమిట్ట ఎస్సీ బాలురు వసతి గృహంలో చిల్డ్రన్స్ డే సందర్భంగా విద్యార్థులకు బకెట్లను, బోధన సామగ్రిని ఎస్‌ఐ సుమన్ గురువారం అందజేశారు. హాస్టల్ వార్డెన్ రమేష్, హెడ్ కానిస్టేబుల్ గోవింద, జయరాం, హాస్టల్ కుక్ జయపాల్ పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం

వెదురుకుప్పం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని ముందస్తుగా నిర్వహించిన క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతులను గురువారం కార్వేటినగరం మండలం డీఎంపురం జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కేశవులు బహుమతులను అందజేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు హాజరయ్యారు.

విద్యార్థికి అభినందన

చిత్తూరు సెంట్రల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ ఇటీవల నిర్వహించిన యువతరంగం-24లో భాగంగా స్పాట్ పెయింటింగ్‌లో స్థానిక పీవీకేఎన్ బీఎస్సీ ఫస్టియర్ విద్యార్థి ఇ.నిరంజన్ ప్రతిభ కనపరచి మొదటి బహుమతి సాధించాడు. విద్యార్థిని గురువారం కళాశాల ప్రిన్సిపాల్ జీవనజ్యోతి, అధ్యాపకులు, అభినందించారు.

నేడు కార్తీక దీపోత్సవం

చిత్తూరు కల్చరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గిరింపేట శివగామి సుందరి సమేత చిదంబరేశ్వర ఆలయంలో శుక్రవారం కార్తీక దీపోత్సవం నిర్వహిస్తున్నట్లు అర్చకుడు మహేష్ తెలిపారు. స్వామి వారికి అన్నాభిషేకం నిర్వహించి, దీపోత్సవం నిర్వహించనున్నామని పేర్కొన్నారు.

వృద్ధులకు అన్నదానం

వెదురుకుప్పం, నవంబరు14(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలోని వృద్ధాశ్రమంలోని వృద్ధులకు గురువారం అన్నదానం చేశారు. ప్రపంచ డయాబెటీస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శ్యామిని, ఇందిరా వితరణతో ఈ కార్యక్రమం నిర్వహించారు.

వైద్యశిబిరం

చిత్తూరు రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): అపోలో నర్సింగ్ కళాశాల ఆధ్వర్యంలో గురువారం నగరంలోని 50వ డివిజన్ పరిధిలోని ఒంటిళ్ల ప్రాంతంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ జయంతి తెలిపారు. 73 మందికి మందులు పంపిణీ చేశామన్నారు. వైద్యులు జాన్, అశోక్‌కుమార్, శివరామకృష్ణ, అమర్‌నాథ్ పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా విగ్రహ ప్రతిష్ఠాపన

వెదురుకుప్పం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): టీకేఎంపురం గ్రామ పంచాయతీ టీకొత్తూరు సమీపంలో గురువారం రుద్రకోటీశ్వర స్వామి వారి యంత్ర, విగ్రహ ప్రతిష్ఠాపన శాస్త్రోక్తంగా నిర్వహించారు. డీసీసీబీ మాజీ డైరెక్టరు సింగం నాగరాజురెడ్డి దంపతులు యజ్ఞపూజ నిర్వహించారు.

నేడు గిరి ప్రదక్షిణ

చిత్తూరు కల్చరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గిరింపేట వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర ఆలయం ఆధ్వర్యంలో శుక్రవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా గిరి ప్రదక్షిణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఈవో సుబ్బారెడ్డి తెలిపారు. గిరింపేట సత్యసాయి సంస్థాన్‌లో శుక్రవారం స్వామి వారికి పౌర్ణమి పల్లకి సేవలు నిర్వహిస్తున్నట్లు సత్యసాయి సేవాసమితి జిల్లా అధ్యక్షుడు మధుసూదనం పేర్కొన్నారు.

విద్యాసామగ్రి వితరణ

విజయపురం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎల్లసముద్రం ప్రాథమిక పాఠశాల పిల్లలకు బాలల దినోత్సవం సందర్భంగా రిటైర్డు ఉపాధ్యాయుడు చంద్రయ్య విద్యా సామగ్రిని గురువారం వితరణ చేశారు. వీటిని టీచర్ వంశీకృష్ణ పంపిణీ చేశారు. శ్రీహరిపురం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఎంఈవో హరిప్రసాద్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి వద్దే వైద్య పరీక్షలు

గుడిపాల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఇంటి వద్దే వైద్యపరీక్షలు నిర్వహిస్తామని గుడిపాల వైద్యాధికారి సంధ్య అన్నారు. గురువారం బట్టువాళ్లూరులో హెల్త్ స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించారు. టీడీపీ నాయకులు సాంబశివనాయుడు, గోవిందరాజులు, యోగానందం, చంద్రశేఖర్, గోపి,రామూర్తినాయుడు, విజయ, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

నేడు గిరిజన యోధుడి జయంతి వేడుకలు

చిత్తూరు అర్బన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గిరిజన పోరాట యోధుడు బిర్సాముండా జయంతి వేడుకలను శుక్రవారం చిత్తూరులోని గిరిజన పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమాధికారి మూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. గిరిజన సంఘాల నాయకులు హాజరవ్వాలని కోరారు.